జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి సోమవారం 6 అక్టోబర్ 2025 సంపుటి : 15 సంచిక : 263 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రమ సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




## ఇకపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే

- వాహనదారులకు షాకిచ్చిన కేంద్రం
- ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఇకపై తగిన మూల్యం చెల్లించక తప్పదు.
- చలాన్ల చెల్లింపు విషయంలో కేంద్రం కీలక సవరణలు ప్రతిపా
- 45 రోజుల్లోగా చలాన్లు కట్టాలి.. వాహనాలపై ఐదుకు మించి చలాన్లు ఉంటే ఏకంగా లైసెన్స్ సైతం రద్దు కావచ్చు.

# తిరుమల తరహాలో శ్రీశైలం క్షేత్రం

- శ్రీశైలం ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఫోకస్
- ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దిశానిర్దేశం
- తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ
- శ్రీశైలంలోని పులుల అభయారణ్యం అభివృద్ధికి పలు సూచనలు
- శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను అనుసంధానించేలా ప్రణాళికలు



**అమరావతి**

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధి పై దేవదాయ, అటవీశాఖలతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన దివ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆలయ సమగ్రాభివృద్ధిపై చర్చించారు. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు. తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటక ప్రాంతంగా, - మిగతా3లో



## ఇదేం తీరు.. గాడిదలు కాస్తున్నారా?

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పాలనలో మీ నిర్లక్ష్యం, మీ అలసత్వం కారణంగా ఇవాళ పేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు
- రాష్ట్ర ప్రభుత్వానికి, మీ పరిపాలనకు ఇది సిగ్గుచేటు వ్యవహారం కాదా?
- 611 మంది చదువుతున్న స్కూల్‌లో ఇంత జరుగుతున్నా అసలు పట్టించుకోరా?
- ఒక ప్రభుత్వం స్పందించాల్సిన తీరు ఇదేనా?"

**తాడేపల్లి**

మన్యం జిల్లాలో పచ్చకామెర్లతో విద్యార్థినుల మృతిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడ్డారు. - మిగతా3లో



## కొండచరియలు విరిగిపడి 14 మంది దుర్మరణం

- శిథిలాల కింద మరింత మంది..
- మిరిక్- కుర్సియాంగ్ పర్యాటక ప్రదేశాలను కలిపే దుడియా ఐరన్ వంతెన కూలిపోయింది.
- జాతీయ రహదారి 110 వెంబడి కొండచరియలు విరిగిపడ్డాయి.
- ఉత్తర బెంగాల్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం అతలాకుతలం

## నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు

- బ్యాలెట్‌లో అభ్యర్థుల కలర్ ఫొటోలు.. కలర్ ఫొటోలు పెట్టడం ఇదే తొలిసారి
- బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజులపాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం..
- పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం
- చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నాం



## ఏపీలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్



- కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు
- కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశముందని ఆరెంజ్ అలర్ట్ జారీ
- రానున్న మూడు గంటల్లో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీ

# పల్లె నుంచి పట్నం బాట

- ముగిసిన దసరా సెలవులు
- రద్దీగా మారిన విజయవాడ - హైదరాబాద్ హైవే!!
- హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
- ఒకదాని వెంట ఒకటి బారులు తీరిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు



**హైదరాబాద్/విజయవాడ**

బతుకమ్మ, దసరా పండుగలు ముగియడంతో సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. సెలవులు ముగియడంతో విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహన రద్దీ నెలకొంది. పల్లెల నుంచి నగరాల వైపు ప్రజలు తిరిగి వెళ్లడం ప్రారంభించడంతో రద్దీ ఏర్పడింది. కార్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి రావడంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్? సమస్య తలెత్తకుండా ట్రాఫిక్? పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోండి : రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి హైదరాబాద్?కు వస్తుండటంతో ఇవాళ, రేపు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సేవలు అందిస్తుంది. బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్ చేరే క్రమంలో వారికి ఎలాంటి - మిగతా3లో

## సంక్షేమం.. అభివృద్ధే వైఎస్సార్‌సీపీ అజెండా



- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ
- మండలిలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై చర్చించాలని పట్టుబట్టామని.. ప్రజా సంక్షేమమే తమ అజెండా
- ప్రజా సంక్షేమంపై తాము రాజీపడేది లేదని స్పష్టం
- "మెడికల్ కాలేజీల ఏర్పాటు పేదవారి వైద్యానికి సంబంధించినది
- మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నాం.

**విశాఖపట్నం**

రాబోయే కాలంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ నేతల విస్తృతస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలిలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణపై చర్చించాలని పట్టుబట్టామని.. - మిగతా3లో




## ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ముప్పు

- అత్యవసర పవర్ యూనిట్ 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్‌ఏటీ) ఊహించని రీతిలో తెరుచుకుంది
- పైలట్లు అప్రమత్తమై ఎంతో చాకచక్యంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు
- ల్యాండింగ్‌కు ఉపక్రమిస్తున్న తరుణంలో విమానంలో సాంకేతిక సమస్య

# కొండచరియలు విరిగిపడి 14 మంది దుర్మరణం



**డార్జిలింగ్:** పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చాలామంది చిక్కుకున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మిరిక్-కుర్సియాంగ్ పర్యాటక ప్రదేశాలను కలిపే దుడియా ఐరన్ వంతెన కూలిపోయింది. కుర్సియాంగ్ సమీపంలోని జాతీయ రహదారి 110 వెంబడి కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్తర బెంగాల్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం అతలాకుతలమయ్యింది. డార్జిలింగ్‌లోని మిరిక్, సుఖియా పోఖారిలలో కొండచరియలు విరిగిపడి 14 మంది మరణించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పశ్చిమ బెంగాల్ - సిక్కిం మధ్య రోడ్డు సంబంధాలు తెగిపోయాయి. డార్జిలింగ్- సిలిగురి మధ్య ప్రధాన రహదారి మూసుకుపోయింది. భారీ వర్షపాతం జల్పైగురి, సిలిగురి, కూచ్‌బెహార్‌లను ప్రభావితం చేసింది. అనేక ప్రాంతాలు నీటమునిగాయి. చిత్రే, సెల్ఫీ దారా తదితర ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారి-10లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సోమవారం ఉదయం వరకు పశ్చిమ బెంగాల్‌లోని ఉప-హిమాలయ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ తెలిపింది. డార్జిలింగ్, కాలింపాంగ్, కూచ్ బెహార్, జల్పైగురి, అలీపుర్దువార్ జిల్లాలలో ఆదివారం అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేయడంతో ఈ ప్రాంతంలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఉత్తర బెంగాల్‌లోని పొరుగు జిల్లా అలీపుర్దువార్‌లో సోమవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తన బులెటిన్‌లో పేర్కొంది. పశ్చిమ జార?ండ్, దక్షిణ బీహార్, ఆగ్నేయ ఉత్తరప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా ఆవరించిన అల్పపీడనం ఉత్తర-ఈశాన్య దిశగా బీహార్ వైపు కదిలి, క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దక్షిణ బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ముర్షిదాబాద్, బిర్భూమ్, నదియా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో పశ్చిమ బెంగాల్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయని, బంకురాలో అత్యధికంగా 65.8 మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.

# నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు



బీహార్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని విధాలుగా సిద్ధమైంది. నవంబర్ 22 లోగా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొంది. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను పెట్టనున్నామని, కలర్ ఫొటోలు పెట్టడం ఇదే తొలిసారి అని ఈసీఐ తెలిపింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజులపాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వాటికి సంబంధించిన వివరాలను పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టంచేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని, గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండనుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశామన్న ఈసీ.. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పింది. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నామని వెల్లడించింది. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలుంటుందని ఈసీ తెలిపింది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బీహార్ ఓటర్లు కూడా స్వాగతించారని పేర్కొంది. వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు. కాగా 243 స్థానాలు కలిగిన బీహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా ఎన్నికలు పూర్తిచేస్తామని చెప్పింది. ఒకటి రెండు దశల్లోనే వీటిని పూర్తిచేయాలనే అభ్యర్థనలు వచ్చాయని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరుగగా.. అంతకుముందు ఐదు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ వెల్లడించింది.

# ఇకపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే

**హైదరాబాద్:** ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేసే వాహనదారులకు హెచ్చరిక. ట్రాఫిక్ రూల్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఇకపై తగిన మూల్యం చెల్లించక తప్పదు. చలాన్ల చెల్లింపు విషయంలో కేంద్రం కీలక సవరణలను ప్రతిపాదించింది. దీని ప్రకారం.. 45 రోజుల్లోగా చలాన్లు కట్టాలి.. వాహనాలపై ఐదుకు మించి చలాన్లు ఉంటే ఏకంగా లైసెన్స్ సైతం రద్దు కావచ్చు. ఇకపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. వివరాల ప్రకారం.. సెంట్రల్ మోటారు వెహికిల్స్ రూల్స్-1989లో కేంద్ర రవాణాశాఖ ఈ కీలక సవరణలను ప్రతిపాదించింది. ఈ క్రమంలో చలాన్లపై చర్యల విషయమై కొత్తగా పలు కఠిన నిబంధనల్ని కేంద్ర రవాణాశాఖ తీసుకొచ్చింది. ఈ మేరకు డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫికేషన్‌ను తాజాగా విడుదల చేసింది. చలాన్ల జారీ, చెల్లింపు, అప్పీల్ చేయడం వంటి అంశాలను డిజిటల్ మానిటరింగ్, ఆటోమేషన్ ఆధారంగా వేగవంతం చేయాలని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారుకు సంబంధిత అధికారులు మూడురోజుల్లోగా ఎలక్ట్రానిక్ రూపంలో నోటీసు జారీ చేయాలని, ఫిజికల్ రూపంలో 15 రోజుల్లోగా నోటీసు పంపాలని స్పష్టం చేసింది.






**కొత్త రూల్స్ ప్రకారం..**

ఎంవీ(మోటారు వెహికిల్) యాక్టు ప్రకారం.. ఒక వాహనంపై ఐదు, అంతకంటే ఎక్కువ చలాన్లు ఉంటే.. డ్రైవింగ్ లైసెన్సును సంబంధిత అథార్టీ సస్పెండ్ చేసే అధికారం ఉంది.

అంతేకాకుండా లైసెన్స్ విషయంలో ఇప్పటికే ఉన్న నిబంధనలు కూడా అలాగే కొనసాగుతాయి.

కొత్త నిబంధనల ప్రకారం.. చలాన్ చెల్లింపు గడువును 45 రోజుల్లో కట్టాల్సిందే. ప్రస్తుతం 90 రోజుల్లోగా చలాన్ చెల్లించాలి.

చలాన్ కట్టకపోతే వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు ఉంటుంది.

ఒకవేళ చలాన్ల చెల్లింపు సకాలంలో జరగకపోతే.. సదరు వాహనంపై రవాణాశాఖ ఎలాంటి లావాదేవీలను అనుమతించదు.

ఈ కారణంగా వాహనం అమ్మకం, కొనుగోలు వంటి జరగలేవు. లైసెన్సులో చిరునామా, పేరు మార్పుతోపాటు రెన్యువల్ కూడా కుదరదు.

ప్రస్తుతం చలాన్లు వాహన యజమాని పేరుతో జారీ అవుతున్నాయి.

కొత్త రూల్ ప్రకారం.. డ్రైవింగ్ చేస్తున్న సమయంలో యజమాని వాహనం నడపలేదని నిరూపిస్తే.. డ్రైవింగ్ చేసిన వ్యక్తి బాధ్యుడు అవుతారు.

**అభ్యంతరాల స్వీకరణ..**

కేంద్ర రవాణా శాఖ ప్రతిపాదించిన ముసాయిదా నిబంధనలపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఢిల్లీలో రహదారి రవాణా మంత్రిత్వశాఖలోని అదనపు కార్యదర్శికి పంపవచ్చని కేంద్రం తెలిపింది. comments-morth@gov.in కు ఈ-మెయిల్ కూడా చేయవచ్చని సూచించింది.

# ఎన్నికల బరిలో సనాతన అభ్యర్థులు: అవిముక్తేశ్వరానంద సరస్వతి

**పట్నా:** ఈ ఏడాది చివరిలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఇందుకోసం ఎలక్షన్ కమిషన్‌తో పాటు, వివిధ పార్టీలు సన్నాహాల్లో మునిగితేలుతున్నాయి. తాజాగా జ్యోతిష్య పీఠానికి చెందిన శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సనాతనుల సత్తాను చాటేందుకు రాబోయే బీహార్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. బీహార్‌లోని బెట్టియాలోని అన్ని నియోజకవర్గాల్లో సనాతన లక్ష్యాలకు కట్టుబడిన అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు అవిముక్తేశ్వరానంద సరస్వతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో తనతో పాటు వారంతా చురుకుగా పాల్గొంటారని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో సామాజిక సమస్యల పరిష్కార లక్ష్యం కలిగి, గో రక్షణతో పాటు సనాతన సంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉన్న తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని శంకరాచార్య ఓటర్లను కోరారు. పట్నాలో జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడిన స్వామి అవిముక్తేశ్వరానంద.. గో రక్షణ కేవలం మత విశ్వాసానికి సంబంధించినది మాత్రమే కాదని, సమాజం,




సంస్కృతికి పునాది అని స్పష్టం చేశారు. గోవును 'జాతీయ మాత'గా ప్రకటించాలనే డిమాండ్‌తో తాను ఢిల్లీలోని జాతీయ పార్టీలను సంప్రదించానని, కానీ దీనిపై స్పష్టమైన స్పందన రాలేదని అన్నారు. బీహార్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తర్వాత అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని అవిముక్తేశ్వరానంద సరస్వతి తెలిపారు. అయితే ఏదైనా పార్టీ అభ్యర్థి గో సంరక్షణకు కట్టుబడి ఉన్నట్లు చెబుతూ అఫిడవిట్ దాఖలు చేస్తే, ఆ నియోజకవర్గాల్లో, తాము తమ అభ్యర్థిని నిలబెట్టబోమని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలోని బ్రహ్మన్‌పూర్ గ్రామంలో 1969, ఆగస్టు 15న జన్మించిన ఉమాశంకర్ ఉపాధ్యాయ, వారణాసిలోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయంలో శాస్త్రి, ఆచార్య డిగ్రీలను పూర్తి చేశారు. 2003, ఏప్రిల్ 15న దండ్ సన్యాసం తీసుకున్నాక ఆయన స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిగా మారారు. 2022,సెప్టెంబర్‌లో ఆయన జ్యోతిష్య పీఠానికి శంకరాచార్యగా నియమితులయ్యారు. ఆయన గో రక్షణ, సనాతన సంప్రదాయాల పునరుద్ధరణ తదితర అంశాలపై చాలాకాలంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. 2008లో అవిముక్తేశ్వరానంద సరస్వతి 'గంగ'ను జాతీయ నదిగా ప్రకటించాలని నిరాహార దీక్ష చేపట్టారు. ఇప్పుడు రాబోయే బీహార్ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించనున్నట్లు తెలిపారు.

## ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ముప్పు




**బర్మింగ్‌హామ్:** ఎయిర్ ఇండియా విమానానికి కొద్దిపాటిలో పెను ప్రమాదం తప్పిన ఉదంతం చోటుచేసుకుంది. భారత్‌లోని అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు బయలుదేరిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానంలో గాలిలో ఉన్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ల్యాండింగ్ కోసం విమానం కిందకు దిగుతున్న సమయంలో దానిలోని అత్యవసర పవర్ యూనిట్ 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్ఏటీ) ఊహించని రీతిలో తెరుచుకుంది. అయితే, పైలట్లు అప్రమత్తమై ఎంతో చాకచక్యంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఏఐ117 విమానంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బర్మింగ్‌హామ్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ఉపక్రమిస్తున్న తరుణంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో విమానంలోని ప్రయాణికులుగానీ, సిబ్బంది ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 'అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న ఏఐ117 విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో టర్బైన్ తెరుచుకున్నట్లు మా సిబ్బంది గుర్తించారు. అయితే ఆ సమయంలో విమానంలోని ఇతర వ్యవస్థలన్నీ సాధారణంగానే పనిచేస్తున్నాయి. మొత్తానికి విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది' అని పేర్కొంది. ల్యాండింగ్ అనంతరం విమానంలో నిపుణులతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈ అంతరాయం కారణంగా బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఏఐ114 విమాన సర్వీసును రద్దు చేసినట్లు తెలిపింది. కాగా ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని పేర్కొంది. సంస్థకు ప్రయాణికుల భద్రతే ముఖ్యమని ఎయిర్ ఇండియా మరోమారు స్పష్టం చేసింది.

## కరూర్ తొక్కిసలాట.. ప్రచారరథం సీజ్.. డ్రైవర్‌పై కేసు నమోదు



కరూర్ తొక్కిసలాట ఘటనకు ముందు టీవీకే చీఫ్ నటుడు విజయ్ ప్రచారరథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ప్రచారరథాన్ని సీజ్ చేశారు. ఆ వాహనం నడిపిన డ్రైవర్‌ను విచారిస్తున్నారు. ఇటీవల తమిళనాడులోని కరూర్ జిల్లాలో విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఎందుకంటే ఈ ఘటనలో ఏకంగా 41 మంది మరణించారు. 80 మందికిపైగా గాయపడ్డారు. ఇదిలావుంటే ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో పోలీసులు మరో కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

## కోళ్లు.. గొర్రెల వివరాలు అడగవద్దని చెప్పా..కులగణనపై డీకే



కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తి కావడానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉండడంతో.. అధికారులు సర్వేను మరింత వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణనకు వెళ్లే అధికారులకు ముందే తాను పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలను వారికి ఎన్ని కోళ్లు, గొర్రెలు, మేకలున్నాయి? ఎంత బంగారం ఉందనే వ్యక్తిగత ప్రశ్నలు, వివరాలు అడగవద్దని సూచించానన్నారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రజలు పంచుకోలేని వ్యక్తిగత ప్రశ్నలు అడిగవద్దని చెప్పినట్లు తెలిపారు. కానీ సర్వే నిర్వహించే అధికారులు స్వతంత్ర కమిషన్‌కు చెందిన వారు కాబట్టి..ఆ సమయానికి వారు ఏమి చేస్తున్నారో తెలియదన్నారు. రూ.420 కోట్ల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్న ఈ సర్వేలో 60 ప్రశ్నల ప్రశ్నాపత్రం ఉందని..అందులో అడిగే అన్ని ప్రశ్నలకు ప్రజలు కచ్చితంగా సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని శివకుమార్ అన్నారు. సమాధానం చెప్పడం ఇష్టంలేకపోతే అధికారులు వారిని బలవంతం చేయకూడదని కోర్టు సైతం పేర్కొన్నట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అభ్యంతరాలను, ఖర్చును ప్రస్తావిస్తూ, ఎవరు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కులగణనను పూర్తి చేస్తామన్నారు.

**విమానంలో కో పైలట్‌గా భాజపా ఎంపీ!**

2015లో కర్ణాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మరోసారి కులగణనను చేపట్టింది. సెప్టెంబరు 22న ప్రారంభమైన ఈ సర్వే అక్టోబర్ 7న ముగియనుంది.

# పల్లె నుంచి పట్నం బాట

-మొదటిపేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అందుకు తగిన ఏర్పాట్లను సైతం అధికారులు ఇప్పటికే చేశారు. ప్రత్యేకంగా కరీంనగర్, ఆదిలాబాద్, హనుమకొండ, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్?నగర్ వంటి జిల్లాల నుంచి హైదరాబాద్?కు పెద్ద ఎత్తున ప్రయాణికులు వస్తున్నారు. జుబ్లీ బస్టేండ్?తో పాటు ఎంజీబీఎస్ వద్ద ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. మరో వైపు రద్దీకి తగ్గట్లు ఆర్టీసీ తన నిర్ణయాలను తీసుకుంటోంది. ఇప్పుడు సెలవులు పూర్తైన తర్వాత తిరుగు ప్రయాణానికి ప్రయాణికులు సొంతూళ్ల నుంచి ఇప్పటికే బయలుదేరుతున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బస్సు సేవలను నిర్వహిస్తోంది.

హైవేపై బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జయిన కారు : నల్గొండ జిల్లా చిట్యాల వద్ద విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్?లోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన గుర్రె జోష్ కుమార్, పైల మురళితో పాటు హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన చల్లా శ్రీహర్ష సాఫ్ట్‌వేర్ జాబ్?లు చేస్తున్నారు. ఈ ముగ్గురూ ఆదివారం తెల్లవారుజామున కారులో నందిగామ నుంచి హైదరాబాద్ నగరానికి బయలుదేరారు. చిట్యాలకి చేరుకున్న టైంలో



కల్వర్టు వద్ద ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అకస్మాత్తుగా ఆగింది. దాని వెనుకే వెళ్తున్న కారు కూడా ఆగింది. అదే టైంలో వెనుక నుంచి వచ్చిన మరో ప్రైవేట్? బస్సు కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో 2 బస్సుల మధ్య కారు ఇరుక్కుని నుజ్జునుజ్జు అయింది. కారులో ఉన్న చల్లా శ్రీహర్ష తలకు బలమైన గాయం అయింది. జోష్ కుమార్‌కి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం నార్కెట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీహర్షను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# మంత్రులకు ఫుల్ క్లాస్

**విజయవాడ :** కారణాలు ఏమైనా కావచ్చు కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారా? అసెంబ్లీ సమావేశాల్లో కావాలనే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారా? ఇకపై వారి నోటికి కళ్లెం వేయాల్సిందేనా? కేబినెట్ భేటీ తర్వాత సీఎం చంద్రబాబు మంత్రులకు ఏం చెప్పారు? నోరు జారిన ఎమ్మెల్యేలకు తాళం వేయాల్సిందేనని ఎందుకన్నారు? ఇవే ప్రశ్నలు చాలామంది ఎమ్మెల్యేలను వెంటాడుతున్నాయి. బాబు క్లాస్ వెనుక, ఇక వారికి నోళ్లకు తాళం. శుక్రవారం కేబినెట్ భేటీ తర్వాత సీఎం చంద్రబాబు మంత్రులతో కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా మాట్లాడారు. ఒకానొక దశలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేస్థాయికి వెళ్లారు. వెంటనే వాళ్లని పిలిపించుకుని మరీ క్లాస్ పీకారు. కేబినెట్ భేటీ తర్వాత కూడా ఇదే విషయంపై రియాక్ట్ అయ్యారు సీఎం చంద్రబాబు. ఇష్టానుసారంగా మాట్లాడే సభ్యులను నియంత్రించాల్సిన బాధ్యత జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులదేని తేల్చిచెప్పారు. ఇన్‌ఛార్జి మంత్రులకు-శాసనసభ్యులకు మధ్య సమన్వయం ఉండాల్సిందేనన్నారు. అది ఎక్కడో మిస్సవుతుందన్నారు. ఆ విషయాన్ని చాలామంది మంత్రులు మర్చిపోయినట్లు ఉన్నారంటూ క్లాస్ తీసుకున్నారు. ఇన్‌ఛార్జుల మంత్రులదే బాధ్యత. జిల్లాల్లో పాలనా వ్యవహారాలు చూడటానికి ఇన్‌ఛార్జి మంత్రులు అవసరం లేదన్నారు. అందుకు కలెక్టర్లు ఉన్నారని అన్నారట. ఎమ్మెల్యేలతో సమన్వయం, పొలిటికల్ మేనేజ్‌మెంట్, కూటమి పార్టీల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులకు జిల్లాలో ఎమ్మెల్యేలపై నియంత్రణ లేకపోతే ఎలాని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేలు తెలిసో తెలియకో పరిధులు



దాటి ఉండవచ్చని, అలా జరగకుండా చూడాల్సింది ఇన్‌ఛార్జి మంత్రులేనన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఫ్లోర్ మేనేజ్‌మెంట్ చాలా ముఖ్యమని, ఆ బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలన్నది సీఎం మాట. మంత్రులు వారి వారి శాఖలకు సంబంధించి విపక్షాల నుంచి ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ వస్తే వెంటనే వెంటనే కౌంటర్ ఇచ్చేదిగా ఉండాలన్నారు. మంత్రులు తాము ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాలకు ఆటో డ్రైవర్లకు ఆర్థికసాయం పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. కేబినెట్ సమావేశానికి నలుగురు మంత్రులు రాలేదు. వారిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ జ్వరంతో బాధపడుతుండడంతో రాలేదు. మరో ఇద్దరు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్ విదేశీ పర్యటనలో ఉన్న విషయం తెల్సిందే. సీఎం చంద్రబాబు.. మంత్రులకు క్లాస్ తీసుకున్న విషయం తెలియగానే కొందరు ఎమ్మెల్యేలు రకరకాలుగా ఆఫ్ ద రికార్డులో చర్చించుకుంటున్నారు. మొత్తానికి ఓవరాల్‌గా పరిశీలిస్తే ఇన్ ఛార్జ్ మంత్రులకు సీఎం చంద్రబాబు ఫుల్ రైట్స్ ఇచ్చినట్టు కనిపిస్తోంది

# మాగుడు గడ్డితో ఉపాధి, ఆదాయం

**అనంతపురం :** మాగుడు గడ్డి కొరతతో సతమతమైన ఇద్దరు రైతులు, ఉమామహేష్, నజీర్‌లు ప్రభుత్వ రాయితీతో మొక్క జొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించారు. ఇది విజయవంతంగా నడుస్తూ, తమ అవసరాలు తీర్చడమే కాకుండా 20 మందికి ఉపాధి కల్పిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుండి భారీ డిమాండ్ ఉంది. ఈ కేంద్రం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతూ, కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు.ఇద్దరు రైతులు తమ పొట్టేళ్లకు మేతకు మాగుడు గడ్డి కోసం ఇబ్బందిపడ్డారు. ఇతర ప్రాంతాల్లో గడ్డి కోసం తిప్పలుపడ్డారు. అప్పుడు స్థానికంగానే ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో, ప్రభుత్వ రాయితీతో యంత్రాలు కొని, మొక్కజొన్న ఆధారిత మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పుడు వారు దానిని విజయవంతంగా నడుపుతూ.. ఈ కేంద్రం ద్వారా కేవలం తమ అవసరాలు తీర్చుకోవడమే కాదు మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వీరు కూడా ఉపాధి, ఆదాయం పొందుతున్నారు.మాగుడు గడ్డి కోసం మొక్కజొన్న పంటను కోతకు రాకముందే పాల కంకి దశలోనే రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న ఎకరా పంటను రూ.30 వేల నుంచి రూ.42 వేలకు తీసుకుంటారు. ఈ మొక్కజొన్న పంటను యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తారు. అనంతరం దీనికి కొన్ని పోషకాలు కూడా కలుపుతారు.. దానిని మాగుడు గడ్డి బేల్స్‌గా మారుస్తారు. ఈ దీనిని పశువులు, పొటేళ్లకు దాణాగా వినియోగిస్తారు. ఈ మాగుడు గడ్డిని టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ధర పలుకుతుంది.విడపనకల్లు మండలం కరకముక్కలకు చెందిన ఉమామహేష్, పాల్తూరుకు చెందిన నజీర్ మాగుడు గడ్డి ప్రాధాన్యతను గుర్తించారు. వారు ఆరు యంత్రాలు, మూడు ట్రాక్టర్లు కొనుగోలు చేసి, ఏడాదిలో పది నెలలపాటు మాగుడు గడ్డిని ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టగా, రూ.45 లక్షలు రాయితీగా వచ్చింది.



ప్రస్తుతం వారు నెలకు రూ.1.20 లక్షలు రుణ ఈఎంఐ చెల్లిస్తున్నారు. దీనితోపాటు, నెలకు రూ.1.5 లక్షలు నిర్వహణ ఖర్చుల కోసం వెచ్చిస్తున్నారు.ఈ మాగుడు గడ్డికి డిమాండ్ కూడా ఉంది.. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు వంటి ప్రాంతాల్లోని రైతులు ఆర్డర్లు పెట్టి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీనిని పశువులు, జీవాల మేతకు ఉపయోగించుకుంటున్నారు. అంతేకాదు అనంతపురం జిల్లా కలెక్టర్ కూడా ఈ మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం గురించి తెలిసి రైతులను అభినందించారు. తాము గతంలో పశువుల, జీవాల మేత విషయంలో ఇబ్బంది పడ్డామని.. ఈ సమస్యకు పరిష్కారంగా ఇలా మాగుడు గడ్డి ఉత్పత్తి కేంద్రం దిశగా ఆలోచన చేశామన్నారు. తమ ప్రయత్నం ఫలించిందని.. ఈ మాగుడు గడ్డి ఒక బేల్ రెండు నెలలకుపైగా నిల్వ ఉంటుందని.. ఒకవేళ బేల్ విప్పితే వారం మాత్రమే వాడుకోవచ్చని తెలిపారు రైతులు. మొత్తం మీద ఇద్దరు రైతులకు వచ్చిన వినూత్న ఆలోచనతో వారు అవసరాలు తీరడంతో పాటుగా ఆదాయం కూడా వస్తోంది.. అలాగే మరికొందరికి ఈ కేంద్రం ద్వారా ఉపాధి కూడా కల్పిస్తున్నారు.

## ఇదేం తీరు.. గాడిదలు కాస్తున్నారా?

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబూ.. పాలనలో మీ నిర్లక్ష్యం, మీ అలసత్వం కారణంగా ఇవాళ పేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా మీకు కనికరం కూడా లేదు” అంటూ ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ నిలదీశారు. “పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్వోప్లాంటు పాడవడంతో కలుషిత నీరు తాగడం మూలాన, పచ్చకామెర్లు సోకి 4 రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. మరెంతో మంది తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మీ పరిపాలనకు ఇది సిగ్గుచేటు వ్యవహారం కాదా?. 611 మంది చదువుతున్న స్కూల్‌లో ఇంత జరుగుతున్నా అసలు పట్టించుకోరా?. ఒక ప్రభుత్వం స్పందించాల్సిన తీరు ఇదేనా?” అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. ..ముఖ్యమంత్రిగా మీరు, ఇంతమంది మంత్రులు ఉండి గాడిదలు కాస్తున్నారా?. గిరిజన బాలికలు, పేద పిల్లలు అంటే అంత చులకనా?. ఒక్క పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఒక్క ఏడాదిలో 11 మంది విద్యార్థులు అనారోగ్యంతో మరణించినా మీరు కళ్లుమూసుకున్నమాట వాస్తవం కాదా?. ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే చంద్రబాబూ. పేదల తలరాతను మార్చేది చదువేనని మేం నమ్మి, అమ్మ ఒడి సహా ఎన్నో సంస్కరణలు తెస్తూ నాడు-నేడు పనుల ద్వారా ఆ స్కూళ్లను దేవాలయాలుగా మార్చాం. కరెంటు, లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, డిజిటల్ ప్యానెళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు సహా 11 రకాల మౌలిక సదుపాయాలను కల్పించాం. ..పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా రక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు పెట్టాం. మా ప్రభుత్వ హయాంలో నిరంతర సమీక్ష, పర్యవేక్షణ ద్వారా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నాం. మీరు అధికారంలోకి వచ్చాక, మీ సుపుత్రుడు విద్యాశాఖను చేపట్టిన తర్వాత, ప్రైవేటు వ్యక్తుల లాభాలకోసం వారితో చేతులు కలిపి, క్రమంగా ప్రభుత్వ విద్యాసంస్థలను నాశనం చేసుకుంటూ వచ్చారు. మా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన మంచి పేరు ప్రతిష్టలను దెబ్బతీశారు. ..ఇంగ్లిష మీడియంను, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణాన్ని, టోఫెల్ క్లాసులు, 8వ తరగతి వారికి ట్యాబులు, సబ్జెక్ట్ టీచర్స్ కాన్సెప్ట్‌ను, రోజుకో మెనూతో పెట్టే మధ్యాహ్న భోజనం, గోరుముద్ద వీటన్నింటినీ నాశనం చేశారు. మీ దుర్మార్గాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు తగ్గిపోయారు. ఆర్వో ప్లాంట్లు రిపేరు వస్తే వాటిని పట్టించుకునే నాథుడే లేడు. హాస్టళ్లలో విషాహారం కారణంగా మరణాలు సంభవించడమో, ఆస్పత్రుల పాలవడమో పరిపాటిగా మారింది. ఇలాంటి మీ నిర్లక్ష్యమే ఇవాళ కురుపాం ఆశ్రమ పాఠశాలలో గిరిజన బాలికల ఉసురు తీసింది. 1..దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆ కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి. ఇప్పటికైనా కళ్లు తెరిచి, వెంటనే పిల్లల ఆరోగ్యం పట్ల, వారి బడుల్లో వసతులపట్ల శ్రద్ధపెట్టాలి. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తున్నాను. ఎందుకంటే ఇది ప్రభుత్వం చేసిన తప్పిదం కాబట్టి” అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

## తిరుమల తరహాలో శ్రీశైలం క్షేత్రం

-మొదటిపేజీ తరువాయి

పర్యావరణ పరంగా శ్రీశైలం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచించాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. దేవాలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల భూమిని దేవదాయశాఖకు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను అనుసంధానించేలా ప్రణాళికలు చేయాలని ఆదేశించారు సీఎం చంద్రబాబు. శ్రీశైలంలోని పులుల అభయారణ్యం అభివృద్ధికి పలు సూచనలు చేశారు సీఎం చంద్రబాబు. భక్తుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న సందర్భంగా సౌకర్యాలు విస్తరించాలని పవన్ కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు. శబరిమలతో సహా ఇతర ప్రముఖ దేవాలయాల్లో సౌకర్యాలను పరిశీలించి శ్రీశైలాన్ని అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఏపీలో భారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

**అమరావతి:** రాష్ట్రంలో పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ అయ్యింది. రానున్న మూడు గంటల్లో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసింది. విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కోనసీమ, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ అలర్ట్ ప్రకటించింది. కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశముందని ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. చెట్ల కింద ఉండకూడదని.. అప్రమత్తంగా ఉండాలంటూ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ తెలిపింది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కోనసీమ(జి) ముమ్మడివరంలో 79.7మిమీ, పల్నాడు(జి) గుట్లపల్లిలో 60మిమీ, నెల్లూరు(జి) జలదంకిలో 33.5మిమీ వర్షపాతం నమోదైంది.

## సంక్షేమం.. అభివృద్ధే వైఎస్సార్‌సీపీ అజెండా

-మొదటిపేజీ తరువాయి

ప్రజా సంక్షేమమే తమ అజెండా అన్నారు. ప్రజా సంక్షేమంపై తాము రాజీపడేది లేదని స్పష్టం చేశారు. “మెడికల్ కాలేజీల ఏర్పాటు పేదవారి వైద్యానికి సంబంధించినది. మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నాం. పేదవాడి ఆరోగ్య విషయంలో రాజీపడం. కూటమి ప్రభుత్వానికి జగన్ ఫోబియా పట్టుకుంది. ఇంకా ఎన్ని రోజులు జగన్ పేరు చెబుతూ బతుకుతారు. కురుపాంలో 39 మంది విద్యార్థులు పచ్చ కామెర్లతో బాధపడుతున్నారు. అందులో ఇద్దరూ మరణించారు. కూటమి ప్రభుత్వానికి పర్యవేక్షణ కొరవడింది. అశోక్ గజపతిరాజు జెనెటిక్ ప్రాబ్లంతో బాధపడుతున్నారు ఆయనకు అహం ఎక్కువ. సింహాచలంలో ఆరుగురు భక్తులు మరణిస్తే కనీసం అశోక్ గజపతి రాజు పరామర్శించారా? ఆయన గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేరాలు, హత్యలు హత్యాచారాలు పెరిగిపోయాయి. మా హయాంలో ఎన్ని నేరాలు జరిగాయి, ఏడాదిన్నరగా కూటమి పాలనలో ఎన్ని జరిగాయో లెక్కేసుకోండి” అని బొత్స పేర్కొన్నారు.

## అరకు పర్యాటకులకు కారివాన్...

**విశాఖపట్టణం :** విశాఖపట్నం పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా ‘కారవాన్’ వాహనం వచ్చింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో ప్రారంభించగా.. విశాఖపట్నానికి వాహనం చేరింది. విశాఖపట్నానికి చెందిన శివాజీ అనే వ్యాపారవేత్త రూ.1.4 కోట్లతో ఈ వాహనాన్ని సమకూర్చారు. ంఖుఆఅతో ఒప్పందం చేసుకున్న తర్వాత దీనిని నడుపుతారు. త్వరలో టూర్ ప్యాకేజీ వివరాలు ప్రకటిస్తారు. ంఖుఆఅ ఒప్పందంతో ఇది అరకులోయ, పాడేరు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను తీసుకెళ్తుంది.ఆంధ్రప్రదేశ్ టూరిజం ఈ కారవాన్ టూరిజంతో ఒక కొత్త మైలురాయిని చేరుకుంది. పీపీపీ పద్ధతిలో క్యారివ్యాన్ టూరిజంను ప్రారంభించింది. విలాసవంతమైన పర్యాటకాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. విశాఖపట్నం నుండి పర్యాటక ప్రాంతాలకు వెళ్ళడానికి ఒక ప్రత్యేక కారవాన్ సిద్ధం చేశారు. ఈ కారవాన్ సౌకర్యంపై ప్రకృతి ప్రేమికులు చాలా సంతోషంగా ఉన్నారు. ఈ కారవాన్‌లో స్టార్ హోటల్ రేంజ్ సౌకర్యాలతో వివిధ ప్రదేశాలను చూసేందుకు వీలుగా ఉంటుంది. రాష్ట్ర పర్యాటక రంగానికి ఒక మంచి ప్రోత్సాహకమని చెబుతున్నారు.అయితే ఇప్పటికే వీకెండ్‌లో చిన్న, చిన్న కారవాన్లలో వెళ్లడానికి ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. అరకు, పాడేరు, లంబసింగి, వంజంగి, అనంతగిరి, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలకు వెళ్తున్నారు. శనివారం ఉదయం బయల్దేరి, ఆదివారం రాత్రికి తిరిగి వస్తున్నారు. ఐదు నుంచి పది మందికి సరిపడేలా, ఏడు సీట్ల కార్లు, 12 సీట్ల వ్యాన్లను కారవాన్లుగా మార్చుతున్నారు. వీటిలో నిద్రపోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి సోఫాలు, కుర్చీలు ఉంటాయి. కొన్ని చోట్ల మనమే డ్రైవింగ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. కుటుంబంతో కలిసి వెళ్లడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు. పర్యటనకు వెళ్లే వారి సంఖ్యను బట్టి ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయి.

## సంపాదకీయం

# చెల్లని చట్టాలు.. జవసత్వాలు లేని జీవోలు

'మా చేతుల్లో మోసపోవాలని ప్రజలు కోరుకుంటున్నరు. వాళ్లే కోరుకుంటున్నంక ఇంక మాదేముంది? మోసపోయేవాళ్లు ఉన్నరు కాబట్టే మోసం చేస్తున్నం. నమ్మితేనే గదా మోసం చేయగలం' అని నయవంచక కాంగ్రెస్ సర్కారు నైజం గురించి గతంలో రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగానే చేశారు. మోసం చేసి చూపించారు. కామారెడ్డి సాక్షిగా బీసీలను నమ్మించి, అసెంబ్లీ వేదికగా తడిగుడ్డతో గొంతు కోశారు. చెల్లుబాటు కాని చట్టాలు చేస్తూ, జవసత్వాలు లేని జీవోలు తీసుకొస్తూ, తన అనుచరులతోనే కోర్టులో కేసులు వేయిస్తూ బీసీ సోదరులకు రేవంత్‌రెడ్డి తీరని ద్రోహం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మేక వన్నె పులి వంటిది. నమ్మకద్రోహం, నయవంచనే ఆ పార్టీ నైజం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ మొదటినుంచీ ముంచాలనే చూస్తున్నది. నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నది. నిమిషానికో మాట మాట్లాడుతూ, గంటకో విధానాన్ని ప్రకటిస్తూ, పూటకో ఆర్డినెన్స్ తెస్తూ, రోజుకో బిల్లు తీసుకొస్తూ, నెలకో జీవో విడుదల చేస్తూ ఉద్దేశపూర్వకంగానే నాటకాలాడుతున్నది. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఉద్దేశం లేకపోవడం, అసమర్థత, బీసీల పట్ల చిత్తశుద్ధి లోపించడమే అందుకు ప్రధాన కారణం. రిజర్వేషన్లు కల్పిస్తే బలహీనవర్గాలు బలపడుతాయన్న భయంతోనే కాంగ్రెస సర్కార్ మొదటినుంచీ డ్రామాలాడుతున్నది. ఈ డ్రామా వెనుక ఉన్న కపట నాటక సూత్రధారి రేవంత్‌రెడ్డేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్, కులగణన నుంచి మొదలుకొని ఇటీవల తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టంలోని రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేత, తాజా జీవో వరకు అ న్నీ బీసీలను నమ్మించి విద్రోహం చేసే పన్నాగాలే తప్ప, రిజర్వేషన్లు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కావన్నది బలహీనవర్గాల సోదరులు అర్థం చేసుకోవాలి. 'చెల్లని రూపాయికి గీతలెక్కువ' అన్నట్టున్నది రేవంత్‌రెడ్డి సర్కారు తీరు. బీసీలను ఉద్ధరిస్తున్నట్టు ఎగిరెగిరి పడుతూ, ఊదరగొడుతూ నిత్యం ఏదో ఒక చట్టం, జీవో, ఆర్డినెన్స్ అంటూ హడావుడి చేస్తున్నది. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ హామీని నిలబెట్టుకోవడానికి బదులుగా, ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ ఎక్కువగా కష్టపడుతున్నది. అందుకోసం మొదటినుంచీ తప్పులమీద తప్పులు చేస్తూ, బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుపడటంలో విజయవంతంగా సాగుతున్నది. అసలు బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామంటే రాష్ట్రంలో అడ్డుకునేదెవరు? అసెంబ్లీ సాక్షిగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. తెస్తున్న బిల్లుకల్లా సమ్మతిస్తున్నాయి. వాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశం కాంగ్రెస్ సర్కారుకే లేదు. నీ ముక్కు ఏదంటే, చుట్టూ తిప్పి చూపించినట్టు.. రిజర్వేషన్ల అంశాన్ని చుట్టూ తిప్పి తిప్పి పిప్పి చేస్తున్నది కాంగ్రెస్. రిజర్వేషన్లపై చట్టం, ఆర్డినెన్స్, మరో చట్టం, జీవో, పార్టీపరంగా రిజర్వేషన్లు అంటూ మరింత జఠిలం చేస్తున్నది. అసెంబ్లీ– గవర్నర్, గవర్నర్– రాష్ట్రపతి, హైదరాబాద్– ఢిల్లీకి తిప్పుతూ కాలహరణం చేస్తున్నది. మొదట రాజ్యాంగయుతంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి బీసీ కులగణన చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడే తప్పులో కాలేసింది. డెడికేటెడ్ కమిషన్‌ను నియమించకుండానే, రెగ్యులర్ బీసీ కమిషన్‌కు ఆ బాధ్యతను అప్పగించి ఆదిలోనే తప్పటడుగు వేసింది. 2021లో వికాస్ కిషన్‌రావు గవాళి కేసులో జస్టిస్ ఖాన్విల్కర్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పు మార్గదర్శకాల ప్రకారం ముందుకెళ్తేనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు చట్టబద్ధత లభిస్తుంది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినట్టుగా ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, ట్రిపుల్ టెస్టు ద్వారా ప్రతీ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రాజకీయ వెనుకబాటును నిర్ధారించాలి. ఆ డేటా ప్రకారం బిల్లులు రూపొందించి, రాష్ట్రపతి ఆమోదంతో రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేరిస్తేనే, అది న్యాయస్థానాల ముందు నిలుస్తుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను కావాలనే విస్మరించింది. డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయకుండానే, రెగ్యులర్ కమిషన్ ఆధ్వర్యంలో కులగణన సర్వేకు అన్ని ఏర్పాట్లు చేసింది. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో చివరి నిమిషంలో సర్వేకు రెండు రోజుల ముందుగా 2024 నవంబర్ 4న బూసాని నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో ముందుగానే చేయాల్సిన జిల్లాల పర్యటనలు, అభిప్రాయ సేకరణలు బూసాని కమిషన్ కులగణన సర్వే జరుగుతున్న సమయంలో చేసింది. దాంతో సర్వేలో అన్నీ తప్పులు దొర్లాయి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే నివేదిక ప్రతులను తగులబెట్టడం అందుకు నిదర్శనం. ఈ తప్పులున్న సర్వే ఆధారంగానే బూసాని కమిషన్ 42 శాతం రిజర్వేషన్లకు సిఫారసు చేసింది. దాని ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం రెండు బిల్లులను 2025, మార్చి 25న అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆ బిల్లులను ఆమోదించి, రాష్ట్రపతికి పంపించకముందే ఢిల్లీ వెళ్లి జంతర్‌మంతర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి హడావుడి చేశారు. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్లులను పంపించారు. తప్పులతడకగా ఉన్న డేటాతో రూపొందించిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదించరని, కొత్తగా బీసీ రాగం ఎత్తుకున్న బీజేపీ అందుకు ఒప్పుకోదని తెలిసీ, మళ్లీ ఆర్డినెన్స్ డ్రామా చేశారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఏదో ఘనత సాధించినట్టుగా కాంగ్రెస్ మంత్రులు స్వీట్లు పంచుకున్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుమతి లేకుండా ఆ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఎలాగూ ఆమోదించరు. కాబట్టి, పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని కొత్త పల్లవి అందుకున్నారు. బలహీనవర్గాలకు రాజ్యాధికారం ఇవ్వడం ఏ మాత్రం ఇష్టం లేని రేవంత్‌రెడ్డి మనసు అందుకూ అంగీకరించలేదు. అందుకే తాజాగా జీవో పేరిట మరో నాటకానికి తెరలేపారు. పంచాయతీరాజ్ చట్టం–2018 సవరణకు పూనుకున్నారు. ఇది మరో వంచన తప్పితే, రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం కానే కాదు. ప్రామాణికత లేకుండా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితిని 50 శాతం కంటే ఎక్కువకు పెంచితే,అప్పటివరకు ఉన్న రిజర్వేషన్లు కూడా బీసీలకు దక్కవని కోర్టులు చెప్తున్నాయి. గతంలో మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల ఉదాహరణలు మన కండ్లముందే కనిపిస్తున్నాయి. రాజ్యాంగబద్ధత లేని రిజర్వేషన్లను కొట్టివేస్తూ, అప్పటివరకు ఆయా రాష్ట్రాల్లో ఓబీసీలకు దక్కుతున్న రిజర్వేషన్లను తొలగించి ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పుచెప్పింది. ప్రామాణికమైన సర్వే నివేదిక లేకుండా, రాష్ట్రపతి ఆమోదం లేకుండా, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చకుండా జీవో ఇస్తే, అది న్యాయస్థానాల ముందు చెల్లుబాటు కాదు. దీనివల్ల అసలుకే ఎసరు వస్తుంది. ఇప్పటివరకు బీసీలకు అమలవుతున్న రిజర్వేషన్లను కూడా దక్కకుండా చేయాలన్నదే కాంగ్రెస్ కుట్ర. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌పై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. విద్యార్థులు, యువత, రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా యూరియా దక్కక అన్నదాతలు హస్తం ప్రభుత్వంపై కన్నెర్రజేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలకు వెళ్తే ప్రజలు కర్రుకాల్చి వాతపెడుతారని కాంగ్రెస్‌కు, ముఖ్యంగా రేవంత్‌రెడ్డికి తెలుసు. అందుకే, స్థానిక ఎన్నికలపై తాత్సారం చేసేందుకు రిజర్వేషన్ల అంశాన్ని చిక్కుల్లో పడేసి కాలయాపన చేస్తున్నారు. అందుకే, చెల్లుబాటు కానటువంటి చట్ట సవరణ చేశారు. కనీసం ఆ చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపేంత వరకూ ఆగకుండా జీవో తీసుకొచ్చారు. ఆ జీవోను తన అనుచరుల ద్వారా కోర్టు వివాదాల్లోకి లాగి ఎన్నికలను వాయిదా వేయించాలని చూస్తున్నారు. అందులో భాగంగానే రేవంత్‌రెడ్డి అనుచరుడు రెడ్డి జాగృతి అధ్యక్షుడితో కోర్టులో కేసు వేయించారు. అయినా పేదోళ్లు అయితే తన సామాజికవర్గం వారిని సైతం ఇంట్లోకి రానివ్వనని చెప్పిన రేవంత్‌రెడ్డి.. బీసీలను మాత్రం గ్రామపంచాయతీల గడప తొక్కనిస్తారా?

# ఆధునిక సాంకేతికతతో భారీ రిగ్గింగ్



కర్నాటక, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలకు సంబంధించి వెలువడుతున్న ఆరోపణల తీరు చిత్రవిచిత్రంగా ఉంది. ఈ వ్యవహారం కర్నాటకలోని అలంద్ నియోజకవర్గంలో మొదలైంది. ఆన్‌లైన్‌లో ఫారం 7 ద్వారా ఓటర్ల తొలగింపును కోరుతూ 2022 డిసెంబర్‌లో 6018 అభ్యర్థనలు అందాయి. ఈ మొత్తం వ్యవహారం సందేహాస్పదంగా మారింది. ఎన్నికల సంఘం తనంతట తానుగా ఈ వాస్తవాలను వెల్లడించలేదు. మూడేండ్ల తర్వాత బట్టబయలైన ఈ వ్యవహారం గురించి పదే పదే ఆరోపణలు వస్తున్నా, ఆఖరుకు ఈ నెలలో మరోసారి సదరు ఆరోపణలను లేవనెత్తినా ఎన్నికల సంఘం తొలుత ఇవన్నీ నిరాధారమైనవని కొట్టి పడేసింది. ఆ తర్వాత కర్నాటక ఎన్నికల సంఘం ముఖ్యాధికారి ఇందులో 24 మాత్రమే వాస్తవమైనవి, మిగిలిన 5,994 దరఖాస్తులు మోసపూరితమైనవని ప్రకటించాక కేంద్ర ఎన్నికల సంఘానికి జరిగిన తప్పు ఒప్పుకోక తప్పింది కాదు. బ్లాక్ స్థాయి అధికారుల ప్రాథమిక విచారణానంతరం ఈ విషయమై ఎన్నికల అధికారి కల్బుర్గి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. కర్నాటకలోని అలంద్ శాసనసభా నియోజక వర్గంలో ఓటర్ల తొలగింపు, మహారాష్ట్రలోని రాజురా శాసనసభా నియోజకవర్గంలో ఓట్ల చేర్పు ఏ ఒక్క వ్యక్తో చేసిన పని కాదు. ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఏదైనా కంపెనీ గానీ, కాల్ సెంటర్ గానీ ఈ అవకతవకలకు పాల్పడి ఉండొచ్చని తెలుస్తున్నది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఎంపిక చేసిన కేంద్రాలలోని ఓటర్ల జాబితాలో సీరియల్ నంబర్ 1 నుండి తొలగింపునకుగానీ చేర్పుకు గానీ అభ్యర్థనలు నమోదు చేశారు. ఇదంతా పక్కా ప్రణాళిక ద్వారా చేసిన వ్యవహారమే అనడానికి బలమైన ఆధారాలున్నాయి. అలంద్‌లో ఇద్దరు దరఖాస్తుదారులు ఫారం 7 సమర్పిస్తూ ఓటర్ల జాబితా నుండి తమ పేర్లు తొలగించమని పెట్టుకున్న దరఖాస్తులను ఎన్నికల సంఘం తిరస్కరించింది. అంటే ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా కానీ రాజకీయ ప్రయోజనాలతోనే ఇందుకు ఒడిగట్టారని స్పష్టం అవుతున్నది. ఓట్ల తొలగింపుకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసిన దరఖాస్తులలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఫోన్ నంబర్లను పేర్కొన్నారు. ఇదంతా ఎంపిక చేసుకున్న పోలింగ్ కేంద్రాల లక్ష్యంగా మారుమూల ప్రాంతం నుండి నడిపించారని అర్థమవుతున్నది.ఈ అక్రమాలకు పాల్పడిన వారి కోసం కర్నాటక సిఐడి విచారణ చేపట్టింది. జనవరి 16న సిఐడి కర్నాటక ముఖ్య ఎన్నికల అధికారికి ఒక లేఖ రాస్తూ 'మా విచారణలో ఎన్నికల ప్రధానాధికారి ఈ దరఖాస్తులు నమోదు చేసిన ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐ.పి) లాగ్ వివరాలు ఇచ్చింది కానీ ఐ.పి గమ్యస్థానం వివరాలు గానీ, పోర్టు గమ్యస్థానం వివరాలు గానీ ఇవ్వలేదు. కాబట్టి ఆ వివరాలు అందించాల్సింది'గా కోరింది. ఓటర్ల జాబితాలో అక్రమాలకు ప్రయత్నించిన వారి ఉనికి, ఆవాస ప్రాంతం కనుక్కోవడానికి ఈ వివరాలు చాలా అవసరం.ఎన్నికల సంఘం ఈ వివరాలు అందచెయ్యని పక్షంలో అలంద్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడిన పెద్ద తలకాయ (అది వ్యక్తి కావచ్చు, సంస్థ కావచ్చు, ఏ కాల్ సెంటరో కావచ్చు) ఎవరనేది బట్టబయలు చెయ్యలేరు. కర్నాటక సిఐడి 18 నెలలలో 18 అభ్యర్థనలు పంపినా ఎన్నికల సంఘం ఇప్పటి వరకు ఆ వివరాలు ఇవ్వలేదు. తొలుత కేవలం ఆరోపణలనుకున్నవి అక్రమాలేనని స్పష్టం అవుతున్నది. ఇదంతా ఒక పథకం ప్రకారం చేపట్టిన చర్యే అని కూడా స్పష్టం అవుతున్నది.కర్నాటక ఎన్నికల సంఘం ప్రధానాధికారి వివరణను అనుసరించి అలంద్‌లోని 10 పోలింగ్ కేంద్రాలలో ఓట్ల తొలగింపుకు పెట్టుకున్న దరఖాస్తులలో 5,994 ఫోర్జరీవే అని తెలియ వస్తుంది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి ఈ మోసాన్ని గురించి బ్లాక్ స్థాయి అధికారులను హెచ్చరించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయించారు. ఈ మొత్తం వ్యవహారం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తున్నది: ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ ద్వారా ఫారం 7 సమర్పించి ఓటు తొలగించమని వచ్చే అభ్యర్థనలను బ్లాక్ స్థాయి అధికారులు పర్యవేక్షించే ప్రక్రియ ఎలాంటి లోటు పాట్లు లేకుండా జరుగుతుందా లేదా? మన దేశ ప్రజాస్వామ్యాన్ని ఇంత పచ్చిగా నీరుగార్చేందుకు ప్రయత్నించడం ద్వారా ఎవరికి లబ్ధి చేకూరనున్నది? ఓటర్ల జాబితాలో అవకతవకలు చేయడానికిగాను వ్యక్తులు, కంపెనీలు ఆటోమాటిక్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నాయా? అవకతవకలు జరిగాయనేందుకు ప్రాథమికంగా విశ్వసనీయమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం మొదటి నుండీ ఈ ఆరోపణలను ఎందుకు తోసిపుచ్చుతూ వచ్చింది? ఇది దేశవ్యాప్తంగా జరుగుతున్నదా? ఓటర్ల జాబితాలో అక్రమాల గురించి ఒకటకటిగా అనేక ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో వీటిని అరికట్టే సామర్థ్యాన్ని సంతరించుకోవాలనే ఆలోచన ఎన్నికల సంఘానికి ఉన్నట్లా? లేనట్లా? ఎన్నికల్లో సమన్యాయం దక్కడం లేదన్న ఆందోళన నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో పౌరులను విశ్వాసంలోకి తీసుకుని ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘానికి ఉన్నదా? లేదా? అత్యున్నత స్థాయి జుడిషియల్ కమిషన్‌ను నియమించడం ద్వారా స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించడం కానీ, అన్ని రాజకీయపక్షాల ప్రతినిధులు, ఎన్నికల రంగ నిపుణులతో కూడిన కమిటీతో పారదర్శకంగా విచారణ జరిపించడానికి కాని ఎన్నికల సంఘం సిద్ధపడాలి. స్వయం ప్రతిపత్తిగల సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం విశ్వసనీయత నేలబారుకు చేరింది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి రాజ్యాంగంలోని 324, 326 అధికరణాల స్ఫూర్తితో సమ్మిళిత, సార్వజనీన ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# పండుగలతో పబ్బం గడుపుతున్న ప్రభుత్వాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ప్రజలందరినీ పండుగలు పేరుతో మతం మత్తులో ముంచితేలిస్తున్నాయి. సహజంగా దేశంలో ప్రజలకు దైవభక్తి ఎక్కువ. దీనిని ఆసరాగా చేసుకుని భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసిన పాలకులు, ఆ ప్రమాణాలను, రాజ్యాంగ లక్ష్యాలను పక్కన బెట్టి, సెక్యులర్ అనే భావన పాటించకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మత క్రతువుల్లో పాల్గొంటూ, ప్రజలను కూడా వీటిలో భాగస్వామ్యం చేయడం జరుగుతున్నది. దీంతో దేశం లో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మానవ అభివృద్ధి వంటి అంశాలు పక్కదోవపట్టిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రజలు కూడా ఇటువంటి అంశాలను సీరియస్‌గా ఆలోచించకుండా పండుగలు జరుపుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారు. ఈ మతమైకంలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోకలేకపోవడం బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా, నేటికీ మన అక్షరాస్యత 74% శాతంగా ఉంది. ఇది కూడా కేవలం సంతకాలు చేసిన వారిని కలుపుకుంటే... లేదంటే అరవై శాతంలోపే... దీని వల్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన లేకపోవడం వల్ల అసలు సమస్యలు, దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు వంటి అంశాలు అర్థం చేసుకోలేకపోవడంతో పాలకులుచెప్పే మాటల గారడీలో పడిపోతున్నారు. అందుచేతనే వారి జీవితాలు అన్ని రకాలుగా అంతంత మాత్రంగానే ఉన్నాయి.. నేటికీ దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ పథకం, సంక్షేమ పథకాలు, ఉచిత పథకాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. – నాగపూర్‌ను ముంచెత్తిన బౌద్ధ సంద్రం ప్రపంచంలో ఎక్కడా లేని వివిధ రకాల పండుగలు దేశంలో ఉన్నాయి. పూర్వం కాలంలో మామూలుగా పండుగ కార్యక్రమాలు జరుపుకుని, వారి దైనందిన జీవితంలో మునిగిపోయేవారు. కానీ నేడు పండుగలను 'పెద్ద పెద్ద ఈవెంట్స్' లాగా ప్రభుత్వాలే జరపటం ఆశ్చర్యం వేస్తుంది. పుష్కరాలు అని, పౌర్ణమి అని, ఉత్సవాలు అని భారీ ఎత్తున, రోజులు తరబడి చేయడం జరుగుతుంది.కొద్ది మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చు చేసి, భారీ ఎత్తున ప్రజల నుంచి ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది. అనగా భక్తిని 'వ్యాపారం' గా మార్చివేసారు. ప్రజలు నుంచి కొన్ని కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. కొనుగోలు ఆధ్యాత్మిక పుస్తకాలు ఆన్‌లైన్ కొనుగోలు దేవస్థానాలు, ట్రస్టులు, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు భారీగా ఆర్థికంగా బలపడుతున్న పరిస్థితి. నేటి ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, కనీస అవసరాలు తీర్చడం మానేసి, ప్రజలను మభ్యపెట్టే మత క్రతువుల్లో పాల్గొనేటట్లు ప్రోత్సాహిస్తున్నాయి. అసలు ఈ ఆధునిక కాలంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే వివిధ రంగాల్లో అనగా అక్షరాస్యత, ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి విషయంలో, సంతోష సూచిలో, మానవ అభివృద్ధి సూచికల్లో మనం ఎక్కడ ఉన్నాం అని ప్రశ్నించుకుని ప్రభుత్వాలు పనిచేయాలి. కొంతమంది చేతిలోనే దేశసంపద కేంద్రీకృతమై, కొద్దిమంది బిలియనీర్ల సంపద పెరుగుదలచూసి దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుంది అని మురిసి పోవడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఎందుచేతనంటే దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలతోనే జీవితాలు గడుపుతున్నారు. ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలను దృష్టిలో ఉంచుకుని మన దేశాన్ని నడిపించాలి. వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. అవినీతిని నిర్మూలించాలి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, క్యూబా వంటి దేశాలు ఉత్పత్తి రంగంలో ఎలా అభివృద్ధి చెందుతున్నయో చూసి దేశంలో అమలు చేయాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీటవేయాలి. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి. 'ఆత్మనిర్భర్ భారత్, మేక్‌ఇన్ ఇండియా' అనే కార్యక్రమాలు మొదలు పెట్టి దాదాపు దశాబ్దం కాలం గడిచినా ఏ మేరకు ఆ లక్ష్యం చేరేమో ఈ ప్రభుత్వాలు పునఃసమీక్ష చేసారా! ఇటువంటి అంశాలపై దృష్టి సారించడం మానివేసి, కేవలం మత క్రతువులకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తే ఎలా! ఎప్పటికి మన దేశం 'వికసిత భారత్' అవుతుంది...!? ప్రపంచ దేశాలు అన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుంటే మన విద్యాలయాల్లో తిరిగి వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన అంశాలు వంటివి ప్రవేశపెడుతుంటే, ఇక మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యార్థిగా ఎలా మారతాడో ప్రభుత్వాలు చెప్పాలి. ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు విడనాడాలి. ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు స్వస్తి పలకాలి. ప్రభుత్వాలు ఇకనైనా పటిష్ట చర్యలు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే నిజమైన వికసిత భారత్‌గా ఉంటుంది.



# కూటమి ప్రభుత్వంలో డ్రైవర్లకు కుచ్చుటోపి

**అధికారంలోకి రావడానికి అన్ని అబద్ధపు హామీలే**

**నాడు బ్యాడ్జి ఉన్న డ్రైవర్ల అందరికీ అన్నారు ఏడు పంగనామం**

**వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్**



**రాయచోటి అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** నాడు యువగళంలో ఏదేదో వాగిన నారా పుత్రరత్నం లోకేష్ గారు...ఈరోజు నిస్సిగ్గుగా 12 లక్షలా మంది ఆటో డ్రైవర్లను మోసం చేస్తున్న చంద్రబాబు గారి నిర్వాకం చూశారా ప్రజలారా. వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ మీడియాతో మాట్లాడుతూ. బాబు గారు ఏ పథకమైనా మొక్కుబడిగా ప్రారంభించడమే కానీ... మనస్ఫూర్తిగా చెయ్యాలన్న సంకల్పం లేని దగాకోరు ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అంరికీ అర్థమయ్యింది. అప్పుడు యువగలం పాదయాత్రలో లోకేష్ గారు నువ్వు చేసిన బీరాలకి,ఇప్పుడు మీ ప్రభుత్వం చేస్తున్న మోసాలకీ పొంతనే లేదని అర్థమయ్యిందా.. నాలికమందం నారావారు మీరు .డ్రైవర్ అన్నలకు బాబుగారు కడుపు కొట్టారు బ్యాడ్జి ఉన్న వారందరికీ ఆర్థిక సహాయమని మేనిఫెస్టోలో హామీ.2023 లోనే 13 లక్షల మంది అర్హులు ఉన్నారన్న నారా లోకేష్.ఈ రెండేళ్లలో పెరిగిన మరో 2 లక్షల మంది అర్హులు.ఆటో డ్రైవర్లతోపాటు లారీ, టిప్పర్ డ్రైవర్లకు రూ.15000 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి,అధికారంలోకి రావడానికి అన్ని అబద్ధాలు చెప్పారా.15 లక్షల మందికి ఇవ్వాల్సింది 2,250 కోట్లు ఇచ్చింది కేవలం రూ.436 కోట్లే ఏకంగా 12 లక్షల మందికి ఎగవేత ఇప్పటికే భారీగా తగ్గిన ఆటో డ్రైవర్ల ఆదాయం ఆర్థిక సహాయానికి ముఖం చాటేసిన కూటమి ప్రభుత్వం. నాడు జగనన్న ప్రభుత్వంలో నాలుగు సంవత్సరాలలో ఐదు విడుదలగా కరోనా ఉన్న ఆ ఏడాది రెండు విడతలుగా ఇచ్చి ఆర్థికంగా ఆదుకున్నాడు జగనన్న ఆటో డ్రైవర్లకు 2.75.931 మొత్తం లబ్ధిదారులకు 2.75.93 కోట్లకు పైగా ఇంచుమించు మొత్తం జగనన్న ప్రభుత్వంలో వాహన మిత్ర వర్తింపజేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు పెట్టి కేవలం 2.90.669. మంది ఆటో డ్రైవర్లకు ఈ ఏడాది కేవలం 436 కోట్లు ఇస్తున్నారు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరం అవుతున్న రెండు కంతులు ఆటో డ్రైవర్లకు ఇవ్వాల్సి ఉంది ఇప్పటికే 30 వేల రూపాయలు ఒక ఆటో డ్రైవర్ కి బాకీ ఉండగా పంగనామం పెట్టింది కూటమి ప్రభుత్వం. బాబు గారు. సుపుత్రుడు లోకేష్ గారు యువగలం పాదయాత్రలో 15 లక్షల మంది ఆటో కార్మికులు ఉన్నారని ఆయన నోటితోని చెప్పారు మరి ఈరోజు కేవలం రెండు లక్షల 90 వేల మందికి ఇస్తున్నారు అంటే మిగతా 12 లక్షల మందికిపైగా ఎప్పుడు ఇస్తారు అని ఆటో డ్రైవర్లు ట్రిప్పర్ డ్రైవర్లు లారీ డ్రైవర్లు ఎదురుచూస్తున్నారు ఎప్పుడు మా ఖాతాలో 15000 రూపాయలు వేస్తారు అని. కూటమి నాయకులు బడాయి బాటలు మానేసి ఇచ్చిన మాటకు కట్టుబడి మిగతా డ్రైవర్లకు త్వరగా చెల్లించవలసింది గా అని వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్. జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సాంబశివ. మేధావులు కమిటీ కుటమి అధ్యక్షులు రవీంద్ర యాదవ్. రాష్ట్ర ట్రైన్ యూనియన్ కార్యదర్శి సంజీవయ్య. తంబాలపల్లి నియోజకవర్గ బీసీ అధ్యక్షులు రెడ్డి శేఖర. కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పాఠశాల ఆయాలు, వాచ్ మెన్ లకు కనీస వేతనం అమలు చేయాలి

**పెండింగ్లో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించాలి**

**ఆయాలకు, వాచ్ మెన్ లకు ఈఫిఎఫ్, ఈయస్ఐ సౌకర్యం కల్పించాలి**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ**



**అన్నమయ్య జిల్లా అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ఆయాలకు, వాచ్ మెన్ లకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం బి.కొత్తకోట లో పాఠశాలల ఆయాలు, వాచ్ మెన్ ల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి అతిథిగా హాజరైన సాంబశివ మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్మెన్లకు కేవలం ?6,000 రూపాయలు మాత్రమే వేతనం ఇస్తూ, రోజంతా పని చేయించుకోవడం తీవ్రమైన అన్యాయం అన్నారు. రోజంతా పాఠశాల పరిశుభ్రత, పిల్లల సంరక్షణ, భద్రత కోసం కష్టపడుతున్న ఈ కార్మికులు ప్రభుత్వ సేవలో భాగమైనవారే. కానీ వారికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈయస్ఐ వంటి హక్కులు ఇవ్వకుండా దోపిడీ కొనసాగిస్తున్నారని ఆరోపించారు.కొన్ని పాఠశాలల్లో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉందని, అలాంటి పాఠశాలలో అదనపు ఆయాలను నియమించాలని కోరారు.అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న వారిపై రాజకీయ వేదింపులు మానుకోవాలని కోరారు.ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.వాచ్ మెన్ లేని పాఠశాలల్లో వాచ్ మెన్ లను నియమించాలని కోరారు.కూటమి ప్రభుత్వం చిరుద్యోగుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీం భాషా, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు , ఏఐటీయూసీ తంబళ్లపల్లి నియోజకవర్గ అద్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి, ఆయాల సంఘం జిల్లా కార్యదర్శి యశోదమ్మ, ఏఐటీయూసీ నాయకులు బాలకృష్ణ, ఆయాలు లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, నరసమ్మ వాచ్ మెన్ లు గంగప్ప,రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు గారిది దసరా కానుక కాదు ఆటో కార్మికులకు చేస్తున్న ఘరానామోసం:



**ఏమ్మిగనూరు ప్రజా జ్యోతి (అక్టోబర్ 05):** ఆటో మోటారు కార్మికులకు చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కి ఈరోజు దసరా కానుక ఇస్తున్నానంటూ మోసపూరిత సభ నిర్వహించడాన్ని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నర్సింహారెడ్డి, విజేంద్ర లు తెలిపారు. సిపిఐ ఆఫీస్ లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఆటో కార్మికుల అరచేతిలో తేనె రాసి మోచేతి వరకు నాకించే వైఖరి కూటమి ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. ఫ్రీ బస్సు లేని కాలంలో గత ప్రభుత్వం 10,000 రూపాయిలు అందిస్తే, తాను డ్రైవర్లు అందరికి 15,000 ఇస్తానని ఎన్నికలలో హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఫ్రీ బస్సు భారం పెట్టి అందరి డ్రైవర్లకు కాకుండా కేవలం ఓనర్ కమ్ డ్రైవర్లకు మాత్రమే పథకం అమలు చేయడం అన్యాయం కాదా అన్నారు. వాహనమిత్ర పథకం పేరును ఆటో డ్రైవర్లకు సేవలో పథకంగా పేరు మాత్రమే మార్చారని, పాత నిబంధనలు అయినా ఓనర్ కం డ్రైవర్, ఐటి రైటర్న్, 300 యూనిట్ల కరెంటు వంటివి యధావిధిగా కొనసాగిస్తూ, కొత్తగా ఫిటినెస్ మరియు పెనాల్టీల పెండింగ్ అంశాలను కూడా చేర్చారన్నారు. గత ప్రభుత్వ దారిలోనే చంద్రబాబు నడుస్తున్నారని విమర్శించారు. గృహ వినియోగంతో పాటు బ్యాటరీ వాహనాలు ఛార్జింగ్ పెట్టుకోవడం వంటి పరిస్థితుల్లో 300 యూనిట్ల నిబంధనకు హేతుభద్దత లేదన్నారు. అధికారంలో లేనపుడు వ్యతిరేకించిన నిభందనలనే అధికారానికి వచ్చాక అమలు చేయడం దుర్మార్గం కాక మరేమిటన్నారు. రాష్ట్రంలో ఆరు లక్షల పైగా ఆటో కార్మికులు ఉంటే చంద్రబాబు ప్రభుత్వం కేవలం 3 లక్షల మందికి మాత్రమే డ్రైవర్లకు సేవలో పథకం అందిస్తున్నదని మిగిలిన మూడు లక్షల మందికి అన్యాయం చేస్తున్నారన్నారు. అదేవిధంగా తాను హామీ ఇచ్చిన జీవో నెంబర్ 21 రద్దు గురించి, ఆటో మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డు గురించి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. పెండింగ్ పెనాల్టీల భారం పెరిగిపోయి ఆటో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని కావున వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని అసెంబ్లీలో బోండా ఉమాగారు మాటాడుతుంటే, అందుకు భిన్నంగా పెనాల్టీలు కడితే కానీ వాహనమిత్ర డబ్బులు రావని చంద్రబాబు ప్రకటించడం దుర్మార్గం కాదా అని అన్నారు. ఇది ఆటో మోటార్ కార్మికుల్ని మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గిస్తానని ఉదర గొట్టిన కూటమి నేతలు ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జరిపే సభకు విలువ లేదన్నారు. ఈరోజు జరిగే సభలో అయినా చంద్రబాబు ఆటో మోటారు కార్మికులకు ఇచ్చిన హామీల అమలు గూర్చి మాట్లాడాలని ఆటో డ్రైవర్లకు సేవలో పథకాన్ని పేరులో ఉన్నట్లుగానే ఆటో డ్రైవర్లకు అందరికీ అందించాలని, నిబంధనలను సడలించాలని, జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధ ర లు తగ్గిస్తూ ఈ సభలో ప్రకటన చేసి చంద్రబాబు తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను భ్రష్టు పట్టించిన విధంగా ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను బుట్ట దాఖలా చేవద్దని కోరారు. లేని పక్షంలో తమ పోరాటం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు సుంకన్న, రాజు, మధు, ఈరన్న,నారాయణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు రిపోర్టర్ డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి న్యూస్ అక్టోబర్ 5** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని గోపికృష్ణ హైస్కూల్ లో కె ఆర్ యు ఎస్ ఎం ఏ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ అందరికీ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఉపాధ్యాయులందరూ పిల్లలకు చదువుతో పాటు మంచి క్రమ శిక్షణతో కూడిన విలువలు నేర్పించాలని తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులందరిని సన్మానించి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందజేసిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ రాజగోపాల్ రెడ్డి,కడప జిల్లా కె ఆర్ యు ఎస్ ఎం ఏ ప్రెసిడెంట్ రమణ రెడ్డి,జిల్లా కార్యదర్శి బాల సుబ్బారెడ్డి,కోశాధికారి ఆంజనేయులు, ఎంఈఓ సావిత్రమ్మ, కె ఆర్ యు ఎస్ ఎం ఎ ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ రాజారావు, గోపికృష్ణ స్కూల్ అధినేత ప్రదీప్ రెడ్డి,ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కన్నతల్లినే అంతమొందించిన కసాయి కొడుకు



**ప్రొద్దుటూరు రిపోర్టర్ డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి న్యూస్ అక్టోబర్ 5** ప్రొద్దుటూరు శ్రీరామ్ నగర్ లో దారుణ హత్య సంఘటన చోటుచేసుకుంది. గవర్నమెంట్ టీచర్గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ (50)ను ఆమె కుమారుడు యశ్వంత్ (23) కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితుడు యశ్వంత్ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం :

**మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పుష్పవతి**

**ఆటో డ్రైవర్ తో భారీ ఎత్తున ర్యాలీ**



**నందవరం ప్రజా జ్యోతి (అక్టోబర్ 05):** స్థానిక మండల కేంద్రంలో చంద్రబాబు,పవన్ కళ్యాణ్, నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా ఆటో ర్యాలీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పుష్పవతి, మండల అధ్యక్షులు ఖాసింవలి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మరో హామీ రాష్ట్రంలో అమలు చేసిందని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పుష్పవతి అన్నారు. ఈపథకం కింద 2,90,669 మంది ఆటో డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436 కోట్లను జమ చేస్తోంది కూటమి ప్రభుత్వం అని ఒక్కో డ్రైవర్ కు ఏడాదికి రూ.15,000ల ఆర్థిక సాయం ఈ పథకం కింద అందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నాయకుడు పెద్ద ఎల్లప్ప, చిన్న రాముడు, నాగలదిన్నె కిషోర్, కనకవీడు డబ్బా ఈరన్న,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


## మానసిక అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకొని వ్యక్తి మృతి:

**ఎస్సై ఎన్ సి, మల్లికార్జున**



**ప్రజా జ్యోతి తుగ్గలి** జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందినటువంటి యలమంచలి జస్వంత్ వయసు: 25 సంవత్సరాలు,(పెళ్లి కాలేదు) తండ్రి పేరు: చంద్రశేఖర్ (లేట్) అను వ్యక్తి తనకున్న మానసిక అనారోగ్యం కు సంబంధించి గత పది సంవత్సరాల నుండి డాక్టర్ల వద్ద చికిత్స తీసుకుంటున్నప్పటికీ తగ్గకపోగా ఏ సమయంలో ఏం చేస్తున్నానో అర్థం కాక తన మీద తనకే విరక్తి కలిగి నిన్నటి దినం పొలముకు వెళ్లి సూపర్ వాజ్ మోల్ తాగి వాంతులు చేసుకుంటా ఉండగా అది గమనించిన బంధువులు జస్వంత్ ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయినాడు అని అతని తల్లి యలమంచలి దివ్య ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసు వారు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు ప్రారంభించారు.

## విద్యకు ప్రోత్సాహం



**కుక్కునూరు ,ప్రజా జ్యోతి, అక్టోబర్ 05** :కుక్కునూరు మండలంలోని గణపవరం పంచాయతీలో గల గణపవరం గ్రామంలో ఉన్నటువంటి ప్రైమ్ రీ స్కూల్ నందు ఉపాధ్యాయులు లేక విద్యా బోధనకు ఇబ్బందికరంగా మారడంతో అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గాడిద రాంబాబు మానవతా దృకృథంతో ఆలోచించి విద్యార్థుల భవిష్యత్తు కొరకు గత రెండు నెలల నుంచి విద్యను బోధించుటకు తన సొంత ఖర్చులతో ఒక వాలంటీర్ ను నియమించి మానవత్వం చాటుకున్నారు. డీఎస్సీ నూతన ఉపాధ్యాయులు వచ్చేంతవరకు విద్యార్థుల చదువు వెనుక పడకుండా ఉండటం కొరకు వాలంటీర్ ఉపాధ్యాయురాలను కొనసాగించి విద్యార్థుల భవిష్యత్తు కొరకు ముందు ఉంటానని రాంబాబు తెలిపారు.ఈ సందర్భంలో రెండు నెలల గౌరవ వేతనాన్ని వాలంటీర్ ఉపాధ్యాయురాలుకు గ్రామ పెద్దలకు సమక్షంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాహేళమ్మ,వాలంటీర్ విజయ కుమారి,గ్రామ పెద్దలు గాడిద రాము, గాడిద వెంకన్న బాబు, దినేష్, ఉమామహేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ వీరయ్య, మల్లిఖార్జున్, శ్రీను, పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

: రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాషా.....

చాగలమర్రిలో ఆటో డ్రైవర్ లతో తో భారీ ఎత్తున ర్యాలీ



**చాగలమర్రి , ప్రజా జ్యోతి (అక్టోబర్ 05):** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రి లో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాషా ఆధ్వర్యములో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా ఆటో ర్యాలీ 4వ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మరో హామీ రాష్ట్రంలో అమలు చేశారన్నారు. ఈపథకం కింద 2,90,669 మంది ఆటో డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436 కోట్లను జమ చేస్తోంది కూటమి ప్రభుత్వం అని ఒక్కో డ్రైవర్ కు ఏడాదికి రూ.15,000ల ఆర్థిక సాయం ఈ పథకం కింద అందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాషా , మండల అధ్యక్షుడు అలాంస గారి మౌలాలి , మండల ఉపాధ్యక్షుడు కామిశెట్టి రమేష్ , మీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ముల్లా అలాంస అజీమొద్దిన్ , 4వ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు , జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పీరమ్మగారి గౌస్ మోహిద్దిన్ , మండల తెలుగు యువత అధ్యక్షుడు మద్దూరు మాబులాల్ , యువ నాయకులు కింగ్ హుస్సేన్ , అబ్దుల్ రజాక్ , పార్టీ అభిమానులు , పార్టీ కార్యకర్తలు , ఆటో డ్రైవర్లు , తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంలో లౌకికత్వం సామ్యవాదం పదాలను తొలగిస్తే సహించం



**ఆళ్లగడ్డ అక్టోబర్ 05 ప్రజా జ్యోతి న్యూస్** బిసి ఎస్సీ ఎస్టీ ముస్లిం క్రైస్తవ మైనారిటీ సంఘాల హెచ్చరిక భారత రాజ్యాంగ పరిరక్షణ బీసీ ఎస్సీ ఎస్టీ ముస్లిం క్రైస్తవ మైనార్టీల కర్తవ్యం అని రాజ్యాంగం నుండి లౌకిక సామ్యవాదం పదాలను తొలగిస్తే సహించబోమని బీసీ ఎస్సీ ఎస్టీ ముస్లిం క్రైస్తవ మైనార్టీ సంఘాల నాయకులు మరియు ఆల్ ఇండియా బహుజన్ సమాజ్వాది పార్టీ జిల్లా నాయకులు న్యాయవాది సాంబశివుడు తీవ్రంగా హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఆల్ ఇండియా సమాజ్వాది పార్టీ కార్యాలయం నందు పార్టీ నాయకులు జీవి సుబ్బయ్య ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా సమాజ్వాది పార్టీ జిల్లా నాయకులు న్యాయవాది సాంబశివుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 9న మాన్యశ్రీ కాన్షీరామ్ గారి వర్ధంతి సందర్భంగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి బీసీ ఎస్టీ ముస్లిం క్రైస్తవ మైనార్టీ సోదరులంతా హాజరై రాజ్యాంగ పరిరక్షణకు తమ వంతు గళం వినిపించాలని పిలుపునిచ్చారు. అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గల బీసీ ఎస్సీ ఎస్టీ ముస్లిం క్రైస్తవ మైనార్టీ సంఘాల నాయకులు కూడా తమతో కలిసి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని జేఏసీ నాయకులు బీరువాళ్ళ బాషా, అఖిలభారత రజక సంఘం నాయకుడు ఆమడాల రమణ, మాలల సంక్షేమం అభివృద్ధి సంఘం నాయకులు ఓబులేసు కరుణాకర్ తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజ్యాంగ ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని అన్నారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ అక్టోబర్ 9న చేయనున్న నిరసన ధర్నా కార్యక్రమానికి తమ వంతు మద్దతు ప్రకటిస్తున్నామని ఆయా సంఘాల నాయకులు ప్రకటించారు. అనంతరం నాయకులంతా కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.

# కూటమి ప్రభుత్వ అండదండలతో నకిలీ మద్యం మాఫియా

– ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే




**ప్రొద్దుటూరు రిపోర్టర్ డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి న్యూస్ అక్టోబర్ 5** మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసే ఫ్యాక్టరీని కనుక్కొని బట్టబయలు చేసిందన్నారు. నకిలీ మద్యం తయారీలో కూటమి ప్రభుత్వ నాయకుల అండదండలతోనే విచ్చలవిడిగా నకిలీ మద్యం మాఫియా నడిచిందని విమర్శించారు. కేవలం మొలకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రంలో పనిచేసే కూలీలపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేసిందే తప్ప అసలు దోషులను బట్టబయలు చేయలేదని తెలిపారు. ఎన్ బ్రాండ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారు చేసి నేరుగా బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారని అక్కడి నుండి విక్రయాలు జరిపి ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఎన్ బ్రాండ్ పేరుతో తయారవుతున్న మద్యాన్ని ఎవరు సేవించవద్దని రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు అలా సేవిస్తే మీ ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. గత ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నాణ్యమైన మద్యం అందిస్తాననీ ప్రజలకు మోసపూరితమైన వాగ్దానాలు చేసి నేడు చేస్తున్నది ఏంటని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్ బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం తయారుచేసి విక్రయాలు జరుపుతున్నారని విమర్శించారు. ఈ విక్రయాల వల్ల వస్తున్న వాటాలు అధినాయకుల వరకు చేరుతున్నాయని అన్నారు. గత వైసిపి పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని అందించింది అన్నారు. కానీ నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు జె బ్రాండ్ మద్యం తయారు చేసే ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శలు చేశారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం నాసి రకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు మొలకలచెరువు లో అదుపులోకి తీసుకున్న మద్యం ఫ్యాక్టరీ పై తక్షణమే సమగ్ర విచారణ జరిపి అసలు దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు అండతోనే నకిలీ మద్యం తయారవుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఒకవేళ కూటమి ప్రభుత్వంలో సమగ్ర విచారణ జరపకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ లో నమోదు చేసి రాబోయే వైసిపి ప్రభుత్వం లో సమగ్ర విచారణ జరిపే అసలు దోచులను శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం వైసిపి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్కులో మొలకలచెరువు నకిలీ మద్యం ఉదంతాన్ని ఆయన నమోదు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు కౌన్సిలర్ లు వరికుంటి ఓబులరెడ్డి రాగుల శాంతి గుర్రం లావణ్య మన్నె సత్యం వైసీపీ మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు నల్లదేసి జంగమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులను మోసం చేసిన .. కూటమి ప్రభుత్వం

: భగత్ సింగ్ ఆటో యూనియన్ జిల్లా నాయకులు సాకే నాగరాజు




**గుంతకల్లు అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఆటో డ్రైవర్లకు అనేక షరతులు పెట్టి అనేక మంది ఆటో డ్రైవర్లను అనార్హులుగా గుర్తించి కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులను మోసం చేసిందని భగత్ సింగ్ ఆటో యూనియన్ జిల్లా నాయకులు సాకే నాగరాజు అన్నారు. ఆదివారం గుంతకల్లు పట్టణంలో హంపి రెడ్డి భవనంలో సీఐటీయూ (అనుబంధ) భగత్ సింగ్ ఆటో యూనియన్ ఆటో కార్మికులలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా భగత్ సింగ్ ఆటో యూనియన్ జిల్లా నాయకులు సాకే నాగరాజు మాట్లాడుతూ శనివారం రోజు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆటో డ్రైవర్ సేవలో అనే పథకాన్ని ప్రారంభించడం జరిగింది. మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేయడం వల్ల అనేకమంది ఆటో కార్మికులు రోడ్డు పాలు అయిపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి డ్రైవర్ 15000 ఇస్తామని చెప్పి కూటం ప్రభుత్వం హామీ ఇస్తూ నిన్నటి రోజు ప్రారంభిం చడం జరిగింది.గుంతకల్లు నియోజవర్గ లో పనిచేయడా నికి ఎలాంటి ఉపాధి పని లేక అనేకమంది చదువుకున్న నిరుద్యోగులు ఆటో ల పై ఆధారపడి జీవనం కొనసాగు తున్నారు.గుంతకల్లు నియోజవర్గం మొత్తం 8,000 వేల మంది పైగా ఆటో కార్మికులు ఉండగా నిన్నటి రోజు మన నియోజకవర్గానికి కేవలం 1747 మంది ఆటో కార్మికులకే ఈ పథకం వర్తింపజేయడం చాలా అన్యాయం, దుర్మార్గం గుంతకల్లు పట్టణంలో 567, గుంతకల్లు రూరల్ 398, గుత్తి పట్టణం లో 280, గుత్తి రూరల్ 258, పామిడి పట్టణంలో, రూరల్ 254 మంది కార్మికులు మాత్రమే వర్తింప చేయడం చాలా సిగ్గుచేటు.ఈ పథకానికి అనేకషరతులు పెట్టి అనేక మంది ఆటో డ్రైవర్ అనర్హులు గా గురి కావడానికి ప్రభుత్వం పూనుకుంది. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రతి లైసెన్స్ ఉన్న వారికి పథకం అమలు చేస్తామ ని తెలియజేసి.రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని పునరుద్ధించి ప్రతి లైసెన్స్ కలిగిన డ్రైవర్ కి అమలు చేయాలని.సెకండ్ పార్టీ ఆటో ఓనర్ కు అగ్రిమెంట్ పేపర్లు తోనే ఈ పథకాన్ని అమలు చేయాలని. 300 యూనిట్లు విద్యుత్ చార్జీలను దీని వెంటనే రద్దు చేయాలని. ఈ చలానాలూ పెండింగ్ లో ఉన్న ఈ పథకాన్ని అమలు చేయాలని కనీసం ఈ చలానాలు కట్టే కన్నా ఈ పథకం ఉపయోగపడుతుం దని భగత్ సింగ్ ఆటో యూనియన్ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే రాబోయే రోజుల్లో ఆటో కార్మికులను క్యాబ్ డ్రైవర్ ని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్.కె భాష, తిమ్మప్ప, లోకు, రాజు, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కోటగడ్డ వీధిలోని గ్యార్మి లో పాల్గొన్న చాగలమర్రి ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్...........



**చాగలమర్రి , అక్టోబర్ 05(ప్రజా జ్యోతి న్యూస్ )** నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామంలో కోటగడ్డ(13వ వార్డ్)లోని దస్తగిరి స్వామి దర్గా వద్ద గ్యార్మీ పండుగ సందర్భంగా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి , భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చాగలమర్రి మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్. మహమ్మద్ సోహెల్ , వార్డు మెంబర్ లడ్డుమహబూబ్ భాష , పార్టీ అభిమానులు , పార్టీ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

## తన స్వలాభం కోసం పోలీసుల భజన చేస్తున్న జి. వి ప్రవీణ్ - వైసీపీ పట్టణ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి



**ప్రొద్దుటూరు రిపోర్టర్ డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి న్యూస్ అక్టోబర్ 5** పట్టణ వైసీపీ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి ఆదివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఓ మీడియా సమావేశంలో ప్రవీణ్ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ప్రొద్దుటూరు పోలీసులపై చేసిన వ్యాఖ్యలను కనీసం ఎమ్మెల్యే పేరు కూడా చెప్పకుండా త్రిప్పి కొట్టడంతో పాటు దసరా ఉత్సవాల నిర్వహణను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారని, దసరా ఉత్సవాలను విజయవంతంగా పోలీసులు నిర్వహించడం ఆనందకరమేనని, కానీ గత 135 సంవత్సరాల పాటు ఉత్సవాలు ఘనంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండానే పోలీసులు చర్యలు తీసుకున్నారని వివరించారు. ఆయన గత 10 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్నా ఏనాడు పోలీసులను ప్రశంసించని ప్రవీణ్ ప్రస్తుతం కేవలం తన అసాంఘిక కార్యకలాపాలకు పోలీసుల మద్దతు కోసమే వారిని సమర్థించారని విమర్శించారు. కనీసం ఎమ్మెల్యే పేరు కూడా చెప్పకుండా విమర్శించిన ప్రవీణ్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నే విమర్శించే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ని విమర్శించే నైతికత లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు , పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బచ్చల వీర ప్రతాప్ ల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



**ప్రొద్దుటూరు రిపోర్టర్ డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి న్యూస్ అక్టోబర్ 5** ఆచార్ల కాలనీ నందు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య. నియోజకవర్గ పరిధిలోని ఆచార్ల కాలనీ నందు బ్రహ్మం గారి దేవస్థానం ఆవరణంలో హోలీస్టిక్ మరియు అభిలాష్ నేత్ర వైద్యాశాలల సహకారంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య. కార్యక్రమంలో యువనాయకుడు బచ్చల వీరప్రతాప్, ద్వారాకచర్ల రాఘవరెడ్డి, ఏఎంసి వైస్ ఛైర్మన్ పట్నం లక్ష్మణ్,రాష్ట్ర విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాస ఆచారి,తాటి శ్రీనివాసులు, లక్ష్మి భవాని, గాయత్రి, కృష్ణ, రామయ్య, ఓబుళరెడ్డి, శ్రీను, ఆదినారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాకర్ల చారిటబుల్ ట్రస్టు పెళ్ళికానుక..!


నవ వధువుకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సహాయ హస్తం...!

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 వేలు పెళ్లి కానుక అందజేత...!



**ఉదయగిరి అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి న్యూస్)** ఉదయగిరి మండలం కొండాయపాలెం పంచాయతీ, మాసాయిపేట గ్రామంలో షేక్ పీర్ అహ్మద్ – షరీఫా దంపతుల కుమార్తె షేక్ సాజిన్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున నవ వధువుకు పెళ్లి కానుకగా రూ. 10 వేల రూపాయలను అందజేశారు. ఈ సహాయాన్ని ట్రస్ట్ ప్రతినిధులు వధువు కుటుంబానికి వ్యక్తిగతంగా అందజేశారు. శాసనసభ్యుడు శ్రీ కాకర్ల సురేష్ గారి సేవా మనసుకు కృతజ్ఞతగా, వధువు కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున స్థానిక ప్రజలకు సహాయం చేయడం, సమాజంలో అవసరమైన వర్గాలను ఆదుకోవడం లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జల్సా యాదవ్, హరీష్, గంగాధర్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘ్ ఏ100 పంచ పరివర్తన





**తిరుపతి జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి** భారత జాతిని, భారత ప్రజలను భారతమాత రూపంగా మరియు భారతదేశాన్ని తమ మాతృభూమి గా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించడం ఆశయంగా డాక్టర్ కేశవ బలిరాం హెగ్డేవార్ (డాక్టర్ జి) చేత 1925 వ సంవత్సరములో విజయదశమి రోజున నాగపూర్ లో స్థాపించబడిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంద వసంతాలు పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్నది. శతాబ్ది ఉ త్సవాలను కూడా భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలిపే దానికి ప్రణాళిక చేయటం ద్వారా భారతదేశ అభివృద్ధి పట్ల సంఘ్ నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ శతాబ్ది ఉ త్సవాల సందర్భంగా కుటుంబ సౌభ్రాతృత్వం, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ ఉ త్పత్తుల వినియోగం,పౌర విధులు- చట్టాల పాటింపు, మరియు సామాజిక సమరసత వంటి పంచ పరివర్తనాల ద్వారా సంఘ్ స్వయం సేవకులతో పాటు ప్రజలలో నైతిక చింతన, పకృతి అనుకూల జీవనశైలి, కుటుంబ విలువలు, స్వదేశీయతను బలపరచటం మొదలైన విషయాల పై విస్తృతమైన ప్రచారం చేయటం ద్వారా భారతీయ సమాజాన్ని సరియైన మార్గంలో పయనించే దానికి విశ్వప్రయత్నం చేస్తుండటం ఎంతైనా ముదావహం. ఈ పంచ పరివర్తనాల లో మొదటిదైన కుటుంబ సౌభ్రాతృత్వం ద్వారా కుటుంబంలో ప్రేమ, గౌరవం, సహకారం . సాంప్రదాయ విలువలు, పెద్దలను గౌరవించడం, చిన్న వారిని ఆదరించటం వంటి ప్రవర్తనలు దేశ ప్రజలను మన సంస్కృతిలో నిక్షిప్తం గా ఉ చేదాని కి దోహదం చేస్తాయి. నేటి ఆధునిక కాలంలో జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా భారతీయ కుటుంబ వ్యవస్థ క్రమక్రమంగా బలహీనపడుతున్నది. కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. అనుబంధాలు, ఆప్యాయతలు కనుమరుగవుతున్నాయి. తల్లిదండ్రులు, భార్య భర్తలు, సోదర సోదరీమణులు, మిత్రులు, గురువులు మరియు ప్రజల మధ్య సంబంధాలలో పరస్పర బాధ్యత, ప్రేమ, గౌరవం, నమ్మకం అవసరం. కొంతమంది యువత పెళ్లి ని నిర్లక్ష్యంగా తీసుకుంటున్నారు, ఇది కుటుంబ వ్యవస్థకు మరియు సమాజ స్థిరత్వానికి ప్రమాదం కలిగిస్తుంది. రెండవది అయిన పర్యావరణ పరిరక్షణ ద్వారా ఇంటి నుండే నీటి పొదుపు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, మొక్కలు నాటడం, సహజ వనరులు వాడటం లో పొదుపు, చెట్లను పెంచడం, వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత మొదలైనవి సమాజంలో మంచి ఆరోగ్యాన్ని తీసుకురావడంలో సహాయపడతాయి. మన చుట్టు ప్రక్కల ఉండే వాతావరణమే పర్యావరణం. పంచభూతాలను సంరంక్షించటం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. మూడవ దైన స్వదేశీ ఉత్పత్తుల వినియోగం దేశీయ ఉత్పత్తుల వాడకాన్ని పెంచడం, తప్పనిసరి పరిస్థితులలో తప్పితే విదేశీ వస్తువులు వాడకపోవడం, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించటం, కుటీర పరిశ్రమలను ఆదుకోవటం వంటివి భారతదేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతాయి. భారతదేశం ఆర్థికంగా బలపడుతున్న ఈ సందర్భంలో విదేశీ శక్తులు భారత ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే దానికి చేస్తున్నటువంటి కుయుక్తులను మనం ఈనాడు చూస్తున్నాం కానీ రాష్ట్రీయ స్వయంసేవక సంఘం దీనిని ఎప్పుడో ఊహించి పంచపరివర్తన లో స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని చేర్చటం భారతదేశ ఆర్థిక వ్యవస్థ పై సంఘ్ ముందు చూపు తెలియజేస్తుంది. స్వదేశీ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా గ్రామాల యొక్క వికాసం సాధ్యమవుతుంది తద్వారా దేశం కూడా వికసిస్తుంది. నాలుగవ దైన పౌర విధులు మరియు చట్టాల పాటింపు ద్వారా ప్రతి పౌరుడు తప్పనిసరిగా చట్టాలను గౌరవించడం, దేశం పట్ల భక్తి, గౌరవం, బాధ్యతలు కలిగి ఉండటం ముఖ్యంగా విదేశీ వ్యామోహంలో ఉన్న యువత భారత దేశ రాజ్యాంగం మరియు చట్టాలపై గౌరవం పెంపొందించడానికి ఎంతైనా చైతన్యం కలిగిస్తుంది. భారత రాజ్యాంగం పౌరుల కర్తవ్యాలు, హక్కులు, నైతిక మార్గదర్శకత, దేశ సంస్కృతి పై ప్రజల కట ఆరాధన, పూర్వీకుల పై గౌరవం, సత్యం, అహింస మొదలైన ప్రాథమిక సూత్రాలను న్న నిర్దేశిస్తుంది. ఐదవ పరివర్తన సామాజిక సమరసత ద్వారా కుల, మత, భాష, ప్రాంత భేదాలను తొలగించటం, సమానత్వాన్ని, ఐకమత్యాన్ని, మానవత్వాన్ని పా ప్రోత్సహించటం ద్వారా ఇంటి నుంచే మార్పు మొదలవుతుంది, అదే దేశానికి ఫల మార్గాన్ని చూపుతుంది అనే సందేశాన్ని ఇస్తుంది. సామాజిక సమరసత అనేది శ్రీ వ్యక్తిగత, కుటుంబ, నివాస మరియు పనిచేయు ప్రదేశాలలో మొదలై దేశములో భా ప్రజల మధ్య సౌహార్ద భావాన్ని, ఐకమత్యాన్ని తీసుకొని వచ్చి జాతీయ సమైక్యతను కావా కాపాడుతుంది. ప్రతి వర్గం వారి ప్రయోజనాల కోసం మాత్రమే పోరాడుతున్న భక్త ది.ఇది చాలా దురదృష్టకరం సమాజంలోని అన్ని వర్గాలు, మతాలు సమాన అవా హక్కులు పొందాలి అనేదే సంఘ్ సిద్ధాంతం. దేశంలో ప్రజల మరియు మతాల అక్ష మధ్య ఆచారాలు, సాంప్రదాయాలు పరస్పర గౌరవంతో కొనసాగాలి. రాష్ట్రీయ చే స్వయంసేవక సంఘ్ చూపుతున్న ఈ పంచ పరివర్తన లు వ్యక్తిగత జీవిత మార్పు నుంచి సామాజిక మార్పుకు దారి తీసే ఒక చైతన్య ప్రేరణలు. భారతీయ సంస్కృతిలో తీర్థ మాత్రమే లిఖించబడిన వసుధైక కుటుంబం మరియు సర్వేజనా సుఖినోభవంతు వా అనే భావనను విశ్వవ్యాప్తము చేయటమే ఈ పంచ పరివర్తనల సదుద్దేశం. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్య వై.వి .రామిరెడ్డి... పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**: రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాషా.....**

**చాగలమర్రిలో ఆటో డ్రైవర్ లతో తో భారీ ఎత్తున ర్యాలీ**




**చాగలమర్రి , ప్రజా జ్యోతి (అక్టోబర్ 05):** నంద్యాల జిల్లా మండల కేంద్రమైన చాగలమర్రి లో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాషా ఆధ్వర్యములో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా ఆటో ర్యాలీ 4వ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మరో హామీ రాష్ట్రంలో అమలు చేశారన్నారు. ఈపథకం కింద 2,90,669 మంది ఆటో డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436 కోట్లను జమ చేస్తోంది కూటమి ప్రభుత్వం అని ఒక్కో డ్రైవర్ కు ఏడాదికి రూ.15,000ల ఆర్థిక సాయం ఈ పథకం కింద అందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్ బాషా , మండల అధ్యక్షుడు అలాంస గారి మౌలాలి , టౌన్ ఉపాధ్యక్షుడు కామిశెట్టి రమేష్ , మీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ముల్లా అలాంస అజీమొద్దీన్ , 4వ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు , జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పీరమ్మగారి గౌస్ మోహిద్దిన్ , మండల తెలుగు యువత అధ్యక్షుడు మద్దూరు మాబులాల్ , యువ నాయకులు కింగ్ హుస్సేన్ , అబ్దుల్ రజాక్ , పార్టీ అభిమానులు , పార్టీ కార్యకర్తలు , ఆటో డ్రైవర్లు , తదితరులు పాల్గొన్నారు.

# తీవ్రతరమైన పి. హెచ్.సి వైద్యుల ఆందోళనలు

- విజయవాడ పోరాట పథంలో కథం తొక్కిన డాక్టర్లు
- ధర్నా చౌక వద్ద నిరాహార దీక్షతో నిరసనలు
- ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముక పి. హెచ్.సి లు
- పలు సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్





**విజయవాడ ,ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకలైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన బాట చేపట్టారు. తమ హక్కుల కోసం డిమాండ్ చేస్తూ విజయవాడలో పోరాట పథంలో కథం తొక్కారు. ఏపీ.పి. హెచ్ .సి.డి. ఏ శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులుగా, విధి ప్రకారం విజయవాడకు వచ్చి ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్షలో పాల్గొని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరాల కష్టానికి, సేవలకు తగిన గుర్తింపు కావాలంటూ డిమాండ్ చేశారు. ప్రజల సేవను నిస్వార్థంగా కొనసాగిస్తున్న వైద్యులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. తమ డిమాండ్లలో భాగంగా ఇన్‌సర్వీస్ పీజీ రిస్టోరేషన్ 5 సంవత్సరాల పాటు 20% కేటాయింపుతో వెంటనే అమలు చేయాలన్నారు టైమ్ బౌండ్ ప్రమోషన్స్ ,ఎదురుచూస్తున్న ప్రమోషన్లను తక్షణం అమలు చేయాలని ,2020 బ్యాచ్ లకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ట్రైబల్ అలవెన్స్ , ట్రైబల్ ప్రాంతాల్లో సేవలందించే వైద్యులకు ఇవ్వాలని ,సంచార చికిత్స ఇన్సెంటివ్ నెలకు రూ.5000 చెల్లించాలని కోరారు. అర్బన్ ఇన్‌సర్వీస్ పీజీ అర్హత కాలం 6 సంవత్సరాల నుండి 5 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ హక్కులను పత్రాల రూపంలో అమలు చేసిన వెంటనే, విధులకు తిరిగి హాజరవుతామని లేకుంటే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు, వైద్యుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు.

## సూర్యలంక సముద్రతీరంలో ఇద్దరు యాత్రికుల ప్రాణాలను రక్షించిన పోలీసులు, గజ ఈతగాళ్లు

**యాత్రికుల భద్రత కోసం పటిష్ట చర్యలు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్**



**బాపట్ల అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల జిల్లాలోని సూర్యలంక సముద్ర తీరంలో ప్రమాదానికి గురైన ఇద్దరు యాత్రికుల ప్రాణాలను జిల్లా పోలీసులు, గజ ఈతగాళు సమయోచితంగా స్పందించి కాపాడారు. ఈ సాహసోపేత చర్యపై జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ అభినందనలు తెలిపారు.ఆదివారం సూర్యలంక బీచ్ వద్ద వేర్వేరు ఘటనల్లో సముద్రంలో మునిగిపోతున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యాత్రికులు,సూర్యాపేట జిల్లా నివాసి బొడ్డు శ్రీను (45), నల్గొండ జిల్లా కు చెందిన కొట్టుల విగ్నేష్ (18) అలల తాకిడికి కొట్టుకుపోయారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న అవుట్ పోస్ట్ పోలీసులు, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు తమ ప్రాణాలను లెక్కచేయకుండా సముద్రంలోకి దూకి ఇరువురినీ సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సూర్యలంక, వాడరేవు, రామాపురం వంటి బీచ్‌లలో యాత్రికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. వారాంతాలు, సెలవు దినాల్లో అధికంగా వచ్చే పర్యాటకుల రక్షణ కోసం గస్తీ బలగాలు, నిఘా వ్యవస్థను బలోపేతం చేశామని చెప్పారు. సముద్రంలో మద్యం సేవించి ఈత కొట్టరాదని, ఎరుపు జెండాలతో సూచించిన భద్రతా పరిమితుల్లోనే స్నానం చేయాలని హెచ్చరించారు. సముద్రంలో ప్రాణాలను పణంగా పెట్టి యాత్రికులను కాపాడిన అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్ల ధైర్యసాహసాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. యాత్రికులు, కుటుంబ సభ్యులు పోలీసుల స్పందన పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## దుత్తలూరు మండల అయ్యప్ప భక్తులు కు గురు స్వామి సింగవరపు సురేంద్రరెడ్డి విజ్ఞప్తి.....!



**దుత్తలూరు అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి న్యూస్) ప్రతినిధి డి పి ప్రసాద్** శబరిమలై లో వెలసి ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మండల పూజకు నవంబర్ 16వ తేదీ నుండి డిసెంబర్ 27 వరకు మండల పూజలు జరుగుతాయి మండల పూజల యాత్రలో పాల్గొనదలిచిన అయ్యప్ప భక్తులు తప్పనిసరిగా మండల దీక్ష చేయవలెను 41 రోజులు దీక్ష తప్పకుండా చేయాలని సూచిస్తున్నాము అయ్యప్ప భక్తులు కార్తీకమాసం అక్టోబర్ 22 వ తేదీన మాల ధారణ ధరిస్తే 41 రోజులు దీక్ష పూర్తయిన తర్వాత ఇరుముడి కట్టుకొని శబరిమలకు వెళ్లాలని కోరారు అనగా అక్టోబర్ 22వ తేదీన మాల ధరించిన అయ్యప్ప భక్తులు డిసెంబర్ ఒకటో తేదీన ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్ర చేయవలెనని తెలిపారు దుత్తలూరు అయ్యప్ప సేవా సమాజం గురు స్వామి సింగవరపు సురేందర్ రెడ్డి వెల్లడించారు.

## కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మరియు విఆర్ఓ



**రుద్రవరం అక్టోబర్ 05 ప్రజా జ్యోతి న్యూస్ న్యూస్** కూటమి ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి. కూటమి ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని టి లింగం దిన్నే టిడిపి నాయకుడు మీసాల లక్ష్మీ నరసయ్య (చిన్నకృష్ణ), సర్పంచ్ మీసాల లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం కూటమి ప్రభుత్వము మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే పేదలకు కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పథకాలను ప్రభుత్వము అమలు చేస్తుందన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వీఆర్వో నాగ నరసింహులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గమ్మ శోభాయాత్ర

**.వేలం పాటలో లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న నామా.కొండబాబు**





**తాళ్లపూడి,అక్టోబర్5, ప్రజాజ్యోతి న్యూస్** దేవీనవరాత్రి మహోత్సవాలలో భాగంగా తాడిపూడి గ్రామం లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.ఆదివారం అంగరంగ వైభవంగా దుర్గమ్మ శోభాయాత్రను నిర్వహించారు. ఈ యాత్ర ను సొసైటీ అధ్యక్షులు నామా. వెంకట సుబ్బారావు (కొండబాబు) కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన లడ్డు వేలం పాటలో పాల్గొని లడ్డు ప్రసాదాన్ని కొండబాబు కైవసం చేసుకున్నారు. గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా తిరుగుతూ భక్తులందరికీ దుర్గాదేవి దర్శనమిచ్చారు. అనంతరం తాడిపూడి మెయిన్ రోడ్డు నుండి ప్రక్కిలంక వరకు ఊరేగింపుగా వెళ్లి గోదావరి ఘాట్ లో నిమజ్జనం చేశారు . ప్రత్యేక వేషధారణలు మరియు చిన్నపిల్లల కోలాటం , ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు మరియు ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## నేడే స్వచ్ఛతా అవార్డుల పంపిణీ కార్యక్రమం

**జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా బాపట్లలో వేడుక**



**బాపట్ల సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల పట్టణంలోని రోడ్‌లోని కమ్మ కళ్యాణ మండపంలో నేడు (సోమవారం) సాయంత్రం 4 గంటలకు స్వచ్ఛతా అవార్డుల పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐ.ఏ.ఎస్., ఒక ప్రకటనలో తెలిపారు.జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2న రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను ప్రకటించింది. ఇందులో రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లాకు ఒక అవార్డు, జిల్లా స్థాయిలో మొత్తం 49 అవార్డులు లభించాయని కలెక్టర్ వివరించారు.జిల్లా స్థాయి అవార్డు పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నారు. రాష్ట్ర స్థాయి అవార్డులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేయనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

## రుద్రవరం లో లోపించిన పారిశుద్ధ్యం.



**రుద్రవరం అక్టోబర్ 05 ప్రజా జ్యోతి న్యూస్** కలుషితమవుతున్న త్రాగునీరు. రోగాల బారిన పడుతున్న కాలనీవాసులు. పారిశుద్ధ్యం లోపించడం వల్ల త్రాగునీరు కలుషితమై కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. మండల కేంద్రం రుద్రవరంలోని కుమ్మరిపేటలోని ఓ కాలనీలో రక్షిత మంచినీటి సరఫరా చేసే పైపు లీకేజీ కావడంతో గత పది రోజుల నుంచి నీరు నిరంతరం పారుతూ నిలువ ఉండడంతో నీరు మురికి నీరుగా తయారై అందులో దోమలు వృద్ధి చెందుతున్నాయి. కాలనీలో నివసించే ప్రజలకు దోమలు కుట్టడం వల్ల అనేక రోగాలతో పాటు జ్వరాలు అధికమయ్యాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీ కావడంతో నీరు వృధా పోవడమే కాకుండా మురికి నీరుగా తయారవుతున్నాయని పంచాయతీ అధికారులకు చెప్పిన వారు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి కాలనీలో వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి లీకేజీ అయిన పైపు మరమ్మత్తులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అఖిలప్రియ





**ఆళ్లగడ్డ అక్టోబర్ 05 ప్రజా జ్యోతి న్యూస్** ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె నుండి అహోబిలం కు 8 కిలోమీటర్ల రోడ్డును 2 కోట్ల 85 లక్షల రూపాయల తో భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొనడం జరిగింది. ఎంతోకాలంగా అహోబిలం వెళ్లే భక్తులకు బాచేపల్లె నుంచి రోడ్డు సరిగాలేదని తన దృష్టికి తీసుకురావడం జరిగిందని ఆ సమస్య ను నేను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళి సంబంధాలతో మాట్లాడి రోడ్డు కు అవసరమైన నిధులు తీసుకొని వచ్చి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్నామని, అహోబిల లక్ష్మీనరసింహస్వామి తిరుణాల స్టార్ట్ అయ్యేలోపు రోడ్డు పూర్తవుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సర్పంచులకు ఎటువంటి నిధులు ఇవ్వకుండా ఎంతో ఇబ్బంది పెట్టింది, మన ప్రభుత్వం వచ్చాక సర్పంచులు యదేచ్ఛగా ప్రతి ఒక పనులు చేసుకుంటూ సంతోషంగా ఉన్నారని, పార్టీలకు అతీతంగా ఎన్డీఏ కుటుంబ ప్రభుత్వం పనులు చేస్తుందని అదేవిధంగా బాచేపల్లె కు మొదటి విడత ఎన్ఆర్ఈజీఎస్ 40 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని మళ్ళీ రెండో విడత 20 లక్షల రూపాయలు ఇచ్చామని, అలాగే ముస్లిం సోదరుల కోరిక మేరకు షాది ఖానా మసీద్ త్వరలోనే తీసుకొని వస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆళ్లగడ్డ మండలం అంతట ప్రతి ఒక్క చోట అభివృద్ధి పనులు పూర్తవుతున్నాయని మొదటి విడత తర్వాత మళ్లీ ఆళ్లగడ్డ మండలానికి రెండో విడతలో రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అహోబిలంలో మొదటి విడత 40 లక్షలు రెండో విడత 15 లక్షలు అహోబిలం కు దొరకోట్టలకు ఇవ్వడం జరిగిందని గతంలో నేను మంత్రిగా ఉన్నప్పుడు బాచేపల్లె గ్రామంలో ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందని వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని మళ్లీ తీసుకున్నారని, ఇప్పుడు మళ్లీ మన ప్రభుత్వం వచ్చింది కచ్చితంగా ఇంటి స్థలాలు ఇప్పించి ఇల్లు కట్టిస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇవ్వడం జరిగింది.

# అడవిపల్లిపాలెంలో శక్తి యాప్ వినియోగం పై చైతన్యం కల్పించిన ఉమెన్ పోలీస్

**బాపట్ల అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాలికల భద్రత, రక్షణ దిశగా ప్రభుత్వం చేపట్టిన శక్తి యాప్ వినియోగం, దాని ప్రాముఖ్యతపై విద్యార్థినుల్లో అవగాహన పెంచే లక్ష్యంతో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాపట్ల ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో, శక్తి టీం ఎస్సై అనిత ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం బాపట్ల మండలం అడవిపల్లిపాలెం ఏఎంజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి హెడ్ క్వార్టర్స్ టీం సభ్యులు విద్యార్థినులకు శక్తి యాప్ ద్వారా తక్షణ సహాయం పొందే విధానం, 112 ఎమర్జెన్సీ నంబర్ వినియోగం, అలాగే గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అపరిచితులు అనుచిత ప్రవర్తన ప్రదర్శించినప్పుడు వెంటనే స్పందించేలా విద్యార్థినులకు సూచనలు ఇచ్చారు. పిల్లల భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర వహించాలని, ప్రతి చిన్నారి ధైర్యంగా ముందుకు సాగాలని శక్తి టీం సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం వేణు, జానకి, స్వప్న, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




# టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి


ఏపి కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకర్ రావు





**మదనపల్లి అక్టోబర్ 5 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** టమోటాకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకర్ రావు, అన్నమయ్య జిల్లా చైర్మన్ దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లి టమోటా మార్కెట్లో రైతులను కలిసి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీరు ఉన్న డ్రిప్ పరికరాలతో ఎన్నో ఇబ్బందుల నడుమ పంటను సాగు చేస్తున్నామని తీరా మార్కెట్కు వచ్చాక గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోయారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్ రావు మాట్లాడుతు టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని మార్కెట్లో జాక్ పాట్ విధానం తొలగించి దళారి వ్యవస్థను పూర్తి స్థాయిలో అరికట్టేలా కాంగ్రెస్ పార్టీ తరుపున చర్యలు తీసుకుంటామని అలా లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని తెలిపారు. సురేంద్రారెడ్డి మాట్లాడుతు అన్నమయ్య జిల్లాలో మామిడి పంట కూడ ఎక్కువ స్థాయిలో సాగులో ఉందని ప్రతి నియోజకవర్గానికి కోల్డ్ స్టోరేజ్ లు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్య మంత్రి సొంత జిల్లాలోనే రైతులు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటుంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పరిస్థితి ఎలా ఉందో కూటమి ప్రభుత్వం ఆలోచించి రైతంగాన్ని గాడిన పెట్టి రైతులు ఆత్మ హత్యల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. రైతులు సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని గతంలో రైతుల రుణ మాఫీ చేసిన ఘనత కూడ కాంగ్రెస్ పాలనదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి నిగార సుల్తాన వివిధ జిల్లాల కిసాన్ కాంగ్రెస్ చైర్మన్లు పాల్గొన్నారు.

## ముదివేడు పోలీస్ స్టేషన్ ను ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారి ఆకస్మిక తనిఖీ

**అన్నమయ్య జిల్లా అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారు ఆదివారం మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ముదివేడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు పలు సూచనలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, సీడి ఫైళ్లు, %జజుచీూ% ఎంట్రీలు సమయానుకూలంగా అప్‌డేట్ చేయాలని ఆదేశాలు. ద్వారా వచ్చే పిటిషన్లు త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా స్పష్టం. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచినందుకు సిబ్బందిని అభినందించారు. స్టేషన్ భూమిని సర్వే చేయించి చుట్టూ కంచె వేయాలని ఆదేశం. స్టేషన్ ముందర ఉన్న ఖాళీ స్థలాన్ని పెట్రోల్ బంక్ ఏర్పాటు కొరకు ఎస్పీ గారు పరిశీలించారు. సిబ్బందితో వన్-టు-వన్ ఇంటరాక్షన్ చేసి, వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని ఆదేశం. ట్రబుల్ మాంగర్లు గుర్తించి మండల రెవెన్యూ కార్యాలయంలో బైండోవర్ చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలి. డయల్ 112 ఫోన్ కాల్స్ ఆలస్యం లేకుండా వెంటనే అటెండ్ చేయాలని ఆదేశించారు. రాత్రివేళల్లో గస్తీ పెంచి విజిబుల్ పోలీసింగ్ ఖచ్చితంగా ఉండాలని స్పష్టం. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదని, బెల్ట్ షాపులు ఎక్కడా లేకూడదని స్పష్టమైన ఆదేశం. ముదివేడు పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నందున డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ఓపెన్ డ్రింకింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం. మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు త్వరగా దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ వేయాలని ఆదేశించారు. అంగళ్లు చుట్టుపక్కల సీసీ కెమెరాలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశం. ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హాస్టల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రొద్దుటూరులో ఇర్ఫాన్ భాష ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విస్తరిస్తున్న కాంగ్రెస్ పార్టీ



**ప్రొద్దుటూరు రిపోర్టర్ డాక్టర్ ప్రతాప్ ప్రజా జ్యోతి న్యూస్ అక్టోబర్ 5** కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష నేతృత్వంలో ఓటర్ల జాబితాలోని అవకతవకలను నిరసిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రచారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష వెల్లడించారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమిపై విమర్శలు చేస్తూ, ప్రజల ఓట్లను దోచి మూడోసారి అధికారంలోకి వచ్చినట్టు కాంగ్రెస్ పార్టీ ఆవేదన వ్యక్తం చేసింది. ఓటర్ల జాబితాల్లో లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించడం, నిజమైన ఓట్లను తొలగించడం వల్ల ప్రజాస్వామ్యం అవమానించబడిందని, నిజమైన ఓటర్లు తమ హక్కులను వినియోగించ లేక పోతున్నారని ఇర్ఫాన్ భాష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర యువ నేత రాహుల్ గాంధీ , ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పిలుపుమేరకు, ఇర్ఫాన్ భాష పాల్గొని ప్రజలకు ఓటర్ల హక్కుల పరిరక్షణ, సమస్యలను గుర్తించడం, న్యాయపరమైన ఫిర్యాదు పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. రాజుపాలెం మండలంలోని ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి డీసీసీ సెక్రెటరీ అప్పపోగులు ఎల్లయ్య రాజుపాలెం మండల అధ్యక్షుడు అబ్దుల రషీద్, నన్నే భాయ్, వీరయ్య, మౌలాలి, కలందర్, చెన్నూర్ అబ్బాస్, రాజుపాలెం మండలం ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.



## కూటమి ప్రభుత్వం ఆటో, క్యాబ్ మెదలగు వాహనదారులను మోసం చేసింది.

వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు జోగాడ ధ్వజం.




**పోదూరు, అక్టోబర్ 5,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** ఆటో, క్యాబ్ వంటి వాహనదారులకు కూటమి ప్రభుత్వం ఫ్రీ బస్సు పెట్టి ఆటో డ్రైవర్లకు కడుపు కొట్టిందని వైసీపీ జిల్లా అధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో ఆదివారం ఒకప్రకటనలో మాట్లాడుతూ ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్లు కు అధికారంలోకి వచ్చిన వేంటనే రూ.15 వేలు ఇస్తానని చెప్పి కొంతమందికే ఇవ్వడం ఏలా సేవ అవుతుంది ప్రశ్నించారు. కూటమి ఫ్రీ బస్సు లు పెట్టి వారి జీవనోపాధి ని దెబ్బ తీసి వారి పొట్టకొట్టిందన్నారు. ఆటో డ్రైవర్లకు మాత్రమే కాదు లారీ డ్రైవర్ లకు కూడా ఇస్తాం అంటూ మ్యానిఫెస్టోలో చెప్పేరు కదా మరి ఇవ్వని హామీని కూడా ఇస్తున్నాం అంటూ కూటమి నాయకులు. గొప్పలు చెప్పడం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు.రూ 15వేలు గత సంవత్సరం నుండి, రరెండు సంవత్సరాలకు 30వేలు ఇవ్వాలని 15వేలు ఇవ్వడం ఈ మాట కూడా అబద్ధం అని చెప్పక తప్పదు అన్నారు.ఆటో డ్రైవర్లు సేవలో అంటూ రూ.15000 ఇచ్చి ఆటో డ్రైవర్లను మోసం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పథకాలన్నీ కొనసాగిస్తానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు,పవన్ కళ్యాణ్ లు హామీను ఇచ్చారు కదా ఈ కూటమి ప్రభుత్వం అదికారంలోకి వచ్చి ఏడాది న్నర కావస్తున్నా చేసిందేమి లేదన్నారు.తెలుగు దేశం పార్టీ ఆద్వర్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసినట్లే కదా అని ప్రశ్నించారు.

## స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ నాగప్ప పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం



**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు అక్టోబర్ 05** కర్నూలు జిల్లా కు చెందిన సర్దార్ నాగప్ప స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వ్యక్తుల్లో అతి ముఖ్యలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. భారత రాజ్యాంగ పరిషత్ సభ్యులు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ నాగప్ప జీవిత విశేషాలను రచయిత అజీజ్ పుస్తకం రచించారు. ఈపుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం టీజీవీ లలిత కళా క్షేత్రం లో ఉంటుందని నక్కలమిట్ట శ్రీనివాసులు తెలిపారు. ఈకార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ. వెంకటేష్,కర్నూలు ఎంపీ. బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా హాజరౌతారన్నారు. ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోరారు.

## వృద్ధ దంపతుల సమస్య పరిష్కరించిన కన్స్యూమర్ ఫోరం నేత ఈశ్వరి



**రాయచోటి అక్టోబర్ 5 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధ దంపతుల సమస్యకు పరిష్కారం లభించింది. మదనపల్లె నుంచి తన కొడుకుని చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన దంపతులను సిబ్బంది రెండు రోజులుగా అడ్మిట్ చేయకపోవడంతో, వారు ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరి కి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఈశ్వరి వెంటనే ఆసుపత్రికి చేరుకుని సిబ్బందితో మాట్లాడి రోగిని అడ్మిట్ చేసేలా చర్యలు తీసుకున్నారు. తక్షణ స్పందనతో వృద్ధ దంపతులు ఈశ్వర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సమస్యలు ఎవరికైనా ఎదురైతే, వెంటనే తెలియజేయాలని, తాను తక్షణమే స్పందిస్తానని వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరి తెలిపారు

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలవేసి
# మాదిగ జాతి అభ్యున్నతి కోసం మాదిగ దళ పోరాట సమితి

(యండిపిఎస్)ని స్థాపించిన పెద్దపల్లి శేఖర్

అతి త్వరలో తిరుపతిలో భారీ ఎత్తున మాదిగల సమక్షంలో జరపనున్న మాదిగ దళ పోరాట సమితి (యండిపిఎస్)ఆవిర్భావ దినోత్సవ సభ

మాదిగల అభివృద్దే ప్రధాన లక్ష్యం ప్రధాన లక్ష్యం

మాదిగ దళ పోరాటసమితి(యండిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్

మాదిగల సమస్యలు వారి అభివృద్ధిపై భవిష్యత్తు కార్యాచరణపై మాదిగ ఉద్యమ నాయకులతో చర్చించిన పెద్దపల్లి శేఖర్



**అన్నమయ్య జిల్లా అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** మాదిగ జాతి కోసం ఎన్నో సంవత్సరాలుగా మాదిగల అభివృద్దే లక్ష్యంగా ఎన్నో ఉద్యమాలు చేసిన మాదిగ జాతి ముద్దుబిడ్డలు,ఉద్యమ నాయకులతో సమావేశం నిర్వహించిన మాదిగ దళ పోరాట సమితి (యండిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ గారు మాదిగల సమస్యలు వారి అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా మాదిగల భవిష్యత్తు కార్యాచరణపై వారితో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా మాదిగ దళ పోరాట సమితి (యండిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ గారు మాట్లాడుతూమాదిగ జాతి అభివృద్దే లక్ష్యంగా జాతీయ అభ్యున్నతి కోసం ఈ "మాదిగ దళ పోరాట సమితి(యండిపిఎస్)ను స్థాపించామని,ప్రతి ఒక్కరూ మాదిగ జాతి ముద్దుబిడ్డలు భవిష్యత్తులో రాబోయే తరాల మాదిగ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జాతీ అభ్యున్నతి కోసం కష్టపడి పని చేయాలని మన జాతి బిడ్డలు ప్రతి ఒక్కరూ చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించుకొని ఉన్నతమైన స్థానాలకు ఎదిగి ఆర్థికంగా ఎదగాలని మనమందరం కూడా పేదరికంలో ఉన్న మన జాతి బిడ్డల చదువుల కోసం వారిని ఆర్థికంగా ఆదుకుంటూ ప్రోత్సహించాలని అప్పుడే మన జాతీ అభివృద్ధి సాధ్యమవుతుంది. బాగా చదువుకునే నిరుద్యోగులు గా ఉన్న మన జాతి బిడ్డలను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి కృషి చేయాలని ఎంతోమంది ఉద్యమ నాయకులు వారి స్వలాభాల కోసం వారు ఆర్థికంగా ఎదగడం కోసం జాతిని అడ్డుపెట్టుకొని మాదిగలకు అన్యాయం చేస్తున్న ఎంతోమందిని మనం చూస్తున్నం అలా మనం చేయకుండా ప్రధానంగా మన జాతి బిడ్డలకు ఎక్కడ అన్యాయం జరిగినా మన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగలు అందరూ కలిసి ఒక్కటై మన జాతి అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న మన మాదిగ జాతి బిడ్డలను ఆదుకుంటూ వారికి వెన్నంటి ఉంటూ మాదిగ జాతి అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఉద్యమ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య,కడప పలు జిల్లాల ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

## చౌడమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న టిడిపి యువ నాయకులు

మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి



**రాయచోటి అక్టోబర్ 5 ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్** రాయచోటి మండలం శిబ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని తొగటపల్లి నందు వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మ వారి ఉత్సవాల సందర్బంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరై ప్రత్యేక పూజలు జరిపించిన టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీ "మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి"అనంతరం టీచర్ శ్రీనివాస రాజు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమం లో పాల్గొని వారి ఆతిధ్యాన్ని స్వీకరించిన లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

## రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు గారిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**రాయచోటి అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ పరుశురాం గారు మరియు ఉపాధ్యాయుల బృందం విచ్చేసి రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్పగుచ్చం అందజేసినారు

## సంబేపల్లి చెరువుకు ఈతకు వెళ్లి ఇద్దరి యువకులు మృతి



**సంబేపల్లి అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** అన్నమయ్య జిల్లాలో ఆదివారం విషాదకర ఘటన చోటు చేసు కుంది. నియోజకవర్గంలోని సంబేపల్లి వద్ద చెరువుకు ఆదివారం ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఒకరు మదనపల్లె అమ్మచెరువు మిట్టకు చెందిన ఒ ముస్లిం యువకుడు, సంబేపల్లెకు చెందిన అతని బంధువుల యువకుడు చెరువులో ఈత ఆడుతూ ఇద్దరూ మృతి చెందారు. మృతి చెందిన యువకుల వివరాలను సంబేపల్లి పోలీసులు వెల్లడించాల్సి ఉంది. సంబేపల్లి, మదనపల్లె మండలాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఉద్యోగ పదవీ విరమణ సందర్భంగా గంటా గంగాధరం కు సన్మాన మహెూత్సవం..!

విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు..!


డాక్టర్ గంటా గంగాధరం



**నెల్లూరు అక్టోబర్ 05(ప్రజా జ్యోతి న్యూస్)** డాక్టర్ గంటా గంగాధరం పదవి విరమణ చేసిన సందర్భంగా ఆదివారం నెల్లూరు నగరంలోని రోటరీ క్లబ్ లో ఉద్యోగ విరమణ సన్మాన మహెూత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సన్మాన మహెూత్సవ కార్యక్రమానికి పలువురు ఉద్యోగస్తులు, విశ్రాంతఉద్యోగస్తులు,బంధుమిత్రులు పాల్గొని.. ఉద్యోగ పదవీ విరమణ చేసిన డాక్టర్ గంటా గంగాధరంకు పూలమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి.. శాలువాలతో ఘనంగా సత్కరించి.. కేక్ కట్ చేసి.. వీడ్కోలు పలికారు. 13 సంవత్సరాలుగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖలో వివిధ హెూదాలలో డాక్టర్ గంటా గంగాధరం విధులు నిర్వహించి.. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖకే ఆయన మంచి పేరు తీసుకుని వచ్చారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన డాక్టర్ గంటా గంగాధరం మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన అధికారులం దరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తన ఉద్యోగ విరమణ సన్మాన మహెూత్సవానికి పాల్గొని.. తనకు వీడ్కోలు పలికిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ ఉద్యోగస్తులు, విశ్రాంతి ఉద్యోగులు, బంధుమిత్రులు,తదితరులు పాల్గొన్నారు.

## చాగలమర్రిలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు...






**చాగలమర్రి , అక్టోబర్05( ప్రజాజ్యోతి న్యూస్ )** ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు చాగలమర్రిలో దిగ్విజయంగా నిర్వహించ బడ్డాయి. గ్రామ ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు. దేశభక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, శాంతి ప్రదర్శనలు, సేవా ప్రతిజ్ఞతో ఉత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీ అభినవ శంకరానంద స్వాముల వారు మాట్లాడిన ప్రముఖులు సమాజంలో ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ తల్లపురెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , విభాగ్ ప్రచార ప్రాముఖ్ బి. యన్ .రఘునాథ్ , ధర్మప్రచారక్ జి.నరసింహరావు , ఖండ ధర్మ జాగరణ ప్రాముఖ్ కె.వీరమహేంద్రాచారి , చాగలమర్రి మండల హిందూ ధార్మిక సంఘ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న చింతల శ్రీనివాసులు



**సీతారామపురం అక్టోబర్ 5(ప్రజా జ్యోతి న్యూస్)** మండలంలోని బాలాయపల్లి పంచాయతీలోని రంగనాయుడుపల్లి గ్రామానికి చెందిన షేక్ నాయబ్ రసూల్ (30) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో సీతారామపురం మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు దాతృత్వంతో పదివేల రూపాయల ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి అందజేశారు . ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అధైర్య పడద్దని ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా నేనున్నానని ఆకుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, రామమూర్తి రెడ్డి,ముత్తంశెట్టి కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి పోలీసుల హెచ్చరిక

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.



**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు అక్టోబర్ 05** జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారి ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు,నేరచరిత్ర గలవారికి చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్



**బద్వేల్ అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి న్యూస్)** రాష్ట్ర వ్యాప్తంగా 6400 కోట్ల రూపాయలు బకాయిల్లో ఉన్న సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం 400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటని శనివారం కడప ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు ఉంటే కేవలం ఉంటే 400 కోట్లు మాత్రమే విడుదల చెయ్యడం సరికాదని పూర్తి బకాయిలు చెల్లిస్తే ఏ ఒక విద్యార్థికి సమస్య రాకుండా ఉంటుందని వారన్నారు. అదేవిధంగా 400 కోట్లు పడడంలో ఏ విద్యా వ్యవస్థ విద్యార్థుల భవిష్యత్తుకు ముందుకు సాగేటువంటి పరినామం కనిపించట్లేదని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు ఎంతో అవస్థలు పడుతున్నారు అని విద్యార్థులకు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు కలువకుండా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఎన్నికల సమయంలో చెప్పినటువంటి హామీలను అమలు చేయాలని పూర్తి రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి. తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 06న సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)

అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు

అర్జీలపై సమాచారం కొరకు మీకోసం కాల్ సెంటర్ నెంబర్ 1100 ను సంప్రదించగలరు

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్




**రాయచోటి, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 06న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

## రాయచోటి అర్బన్ పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగల జంట ను అరెస్ట్



**రాయచోటి అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి జిల్లా రిపోర్టర్ రాణా ప్రతాప్)** నిందితుల వద్ద నుంచి రూ.30.50 లక్షల విలువైన ఆభరణాలు పోలీస్ లు స్వాధీనం చేసుకున్నారు. 310 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, ద్విచక్ర వాహనం జప్తు పోలీస్ లు జప్తు చేశారు. అరెస్టైన వారు: షేక్ నౌమాన్ అలియాస్ మస్తాన్ (24), మహమ్మద్ షా అలీ జబ్రి అలియాస్ సోహెల్ (39) సోహెల్పై తెలుగు రాష్ట్రాల్లో 175 దొంగతన కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడింపు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ చలపతి ఆధ్వర్యంలో విజయవంతమైన ఆపరేషన్ చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు బృందాన్ని అధికారులను డీస్పీ అభినందనలు

# అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్, కె స్వయంప్రభ కు అవార్డు






**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు అక్టోబర్ 05 జిల్లాలో** గురూజీ అని లక్షలాది మంది విద్యార్థిని విద్యార్థులతో నోరార ప్రేమాప్యాయతలతో పిలిపించుకుని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తో పాటు ఎన్నో అవార్డులు అందుకున్న డాక్టర్ కే. స్వయం ప్రభ ను మరో అవార్డు వరించింది వివరాల్లోకి వెళితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక ఉన్నత పాఠశాలల్లో హిందీ పండిట్ గా తన వృత్తిని దైవంగా భావించి ఎంతో ఇష్టం తో విద్యా బోధన చేసి ఎంతోమంది దిగువ మధ్యతరగతి, రైతులు రైతు కూలీలు,చేతి వృత్తి దారుల పిల్లలైన నిరుపేద విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్ది వారి హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకుని నోరార వారితో గురూజీ అని పిలిపించుకున్న ఘనత డాక్టర్ కే.స్వయంప్రభకే దక్కుతుంది . ఆమె ఉపాధ్యాయ వృత్తితో పాటు అనేక సమాజిక కార్యక్రమాలు నిర్వహిస్తు నిరుపేదలకు, వృద్ధులకు,దివ్యాంగులకు సేవా చేస్తూన్నారు. అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటు ఎందరిలోనో దైవభక్తి నెలకొల్పు తున్నారు. గ్రంథాలయాలు దేవాలయాలు నెలకొల్ప డం లో తన వంతు కృషి చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో ముందున్నారు. తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో మౌళిక వసతుల కోసం ఆమె ఎంతో కష్టపడి దాతల సహకారంతో అభివృద్ధి చేశారు.ఆమె వేసిన మొక్కలు వటవృక్షాలుగా పర్యావరణానికి ఎంతో హితం చేస్తున్నాయి. ఆమెకు వచ్చిన అవార్డు వలన అవార్డులకే కీర్తివస్తుందని సాటి ఉపాధ్యాయులు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అంటుంటారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ల సంయుక్త ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవం లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సమావేశ భవనంలో నిర్వహించారు.డాక్టర్ కే..స్వయంప్రభ బోధనపరంగా సామాజిక పరంగా ఆధ్యాత్మిక పరంగా పర్యావరణపరంగా చేసిన సేవలను గుర్తించి ఆమెను అవార్డుకు ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలోని ప్రముఖులు మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర కల్కూర, గ్యాస్ట్రో కంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ , రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ,కర్నూలు ప్రత్యేక పోలీసు డి.ఎస్.పి, రాయపాటి శ్రీనివాస్, బాల సాహితీవేత్త హరికిషన్, గ్రంధాల డిప్యూటీ సెక్రటరీ పెద్దక్క తదితర కర్నూల్ ప్రముఖుల చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోవడం తో ఆమె తో పని చేసిన ఉపాధ్యాయులు, ఆమె దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులు మరియు స్వచ్ఛంద సంస్థలు డాక్టర్ కే. స్వయం ప్రభ ను అభినందించారు. మరియు అవార్డును ఇచ్చిన సొసైటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయం భోజనశాల షెడ్డు స్థలం కోసం 6 లక్షల రూపాయలు విరాళం


**బద్వేల్ అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్ త్యాగరాజు కాలనీలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయం ఆవరణంలో దేవాలయం కు ఆగ్నేయంగా ఉండే స్థలం అన్నప్రసాదం కోసం స్థలానికి 6,00,000/- రూపాయల విరాళాన్ని త్రిబుల్ ఆర్,వి,యం గ్రూప్ ఆఫ్ కంపెనీ యం.డి రామనబోయిన మురళి సతీమణి సునీత కుటుంబ సభ్యులు రామనబోయిన పుల్లయ్య సతీమణి కృష్ణమ్మ తల్లిదండ్రుల పేరుతో 6,లక్షల రూపాయలు విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు చేతికి అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ వి,యం, కంపెనీ యం.డి రామన బోయిన మురళి యాదవ్ బద్వేల్ ప్రాంతంలో అనేక సంవత్సరాలుగా నెల్లూరు రోడ్డులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రతినెల శ్రవణా నక్షత్రం స్వామివారికి అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం మరియు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా శ్రీ కాశీ విశ్వేశ్వర శివాలయం స్పటిక లింగం ఆలయ నిర్మాణానికి వారు ఎంతగానో కృషి చేస్తూ స్పటిక లింగం శివాలయం ఆవరణంలో ప్రతి సోమవారం స్వామివారిని దర్శించుకునే



భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు, అవసరమైన అన్నదానం భోజనశాల షెడ్డు కు స్థలానికి ఆరులక్షల రూపాయలు విరాళం వారి కుటుంబ సభ్యులు చేతుల మీదుగా అందజేయడం ఎంతో సంతోషకరమన్నారు, వారికి వారి కుటుంబ సభ్యులకు కాశి విశ్వేశ్వర స్వామి శివుని అనుగ్రహం ఉండాలని వారి వ్యాపారం దినదిన వృద్ధి చెందాలని పలువురు కమిటీ సభ్యులు మురళి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోవు రోజుల్లో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో వారి కుటుంబ సభ్యులు చేపట్టాలని అలాగే మరికొందరు కూడా ఆలయానికి వారు వంతు సహాయ సహకారాలు అందజేయాలని పలువురు కోరారు.

# ఆదివారం ఆస్పత్రికి సెలవా-రోగుల ప్రాణాలతో వైద్యులు చెడగాటం.

**ప్రజా జ్యోతి రిపోర్టర్ మధు పామిడి..** పామిడి మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలు ప్రకారం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నద్దే ప్రభుత్వ ఆసుపత్రి లక్ష్యం. ఆ లక్షణాలు నిబంధనలు కర్తవ్యాలు విధులు అలాంటివి పామిడిలో వర్తించవు. ఆదివారం 8 మంది డాక్టర్లు గాను ఒకే ఒక్క డాక్టర్ హాజరు కావడం ఆయన పై అంతస్తులోనే రూముకే అంకితం ఏమిటి అని అడిగితే ఎమర్జెన్సీ ఉంటే తప్ప కింద నా చాంబర్లోకి వస్తానని నిర్లక్ష్యం సమాధానం. ఆదివారం అన్ని గదులు ఖాళీగా కనిపిస్తాయని, మందులు మాత్రలు ఇచ్చే ఫార్మసి కౌంటర్ బంద్, రక్త పరీక్షలు బీపీ షుగర్ కౌంటర్ బంద్, గాయాలకు కట్లు కట్టే సెక్షన్ బంద్ ఎక్స్రే బీపీ షుగర్ చూసే నాథుడే ఉండదని ప్రజలు రోగులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు, ప్రభుత్వం ఆస్పత్రి వైద్యులను అడిగే వారు లేరు తనిఖీ చేయుటకు జిల్లా అధికారులు అంతకన్నారారు. జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, గత ప్రభుత్వం చుట్టూ ఐదు






మండలాలలో ఎక్కడా లేని విధంగా ఐదు కోట్ల 14 లక్షలు వ్యయంతో ఆసుపత్రిని నిర్మించారని, అందుకు తగిన వైద్యం వైద్యాధికారులు లేరని ప్రజలు వాపోతున్నారు. మండలం అంతా సీజన్ వ్యాధులు మితిమీరి పోతున్నాయని, జ్వరాలు వస్తే జిల్లా కేంద్రం ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిందేనని ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. వైద్యో నారాయణహరి వైద్యులు దేవునితో సమానం అన్నారు. మానవతా దృక్పథంతో ప్రజా వైద్యం చేయవలసిన డాక్టర్లు ఇక్కడ జీతం కోసం వస్తున్నారు మధ్యాహ్నం 12 గంటలు కాగానే వెళ్ళిపోతున్నారు. వీటిపై జిల్లా అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, సంబంధిత మంత్రి సత్య కుమార్ యాదవ్ తక్షణం చర్యలు తీసుకోవాలని లేకుంటే కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ప్రజలు సూచనలతో కూడిన హెచ్చరికలు చేస్తున్నారు. గర్భవతులు పసిపిల్లలు క్రిమిసంహారకమందు త్రాగిన వారి సంగతులు దేవుడికి ఎందుకని ప్రజలు ఆందోళన చెందు చున్నారు. ఇప్పటికైనా ప్రజల వైద్య సమస్యలు తీర్చగలరని ప్రజలు కోరుతున్నారు.

# టికెట్ల కోసం ఆశావహుల ఆరాటం

**పెద్దపల్లి:** 'ఎప్పట్నుంచో పార్టీని పట్టుకొని తిరుగుతున్న.. రాకరాక రిజర్వేషన్ సౌకర్యం కలిసొచ్చింది.. మన పార్టే అధికారంలో ఉంది.. టికెట్ ఖరారు చేస్తే నేను ప్రజాప్రతినిధిగా ఎన్నికవుత.. ప్లీజ్.. ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వండి అన్నా' అంటూ ఆశావాహులు కొందరు స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అన్నా.. ఒకేఒక్క చాన్స్ ఇవ్వండని, కచ్చితంగా గెలిచి చూపెడతామని నిత్యం నేతల ఇళ్లచుట్టూ తిరుగుతూ ప్రాధేయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. కలిసొచ్చిన రిజర్వేషన్లతో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. తొలుత ప్రాదేశిక ఎన్నికలు జరగనుండగా.. వీటిని పార్టీ సింబల్‌తో నిర్వహించనున్నారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి టికెట్లు దక్కించుకునేందుకు ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసేందుకు ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి టికెట్లు ఆశించేవా రు మాజీ ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా రు. బీజేపీ టికెట్లు ఖరారు చేసుకునేందుకు మాజీ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ సీనియర్లతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు.

**ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకం**

ప్రధాన పార్టీలు స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తు న్నాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలను అత్యధికంగా గెలుచుకోవాలని కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఇందుకోసం ఆచీతూచీ వ్యవహరిస్తున్నాయి. ప్రతీ స్థానం నుంచి రెండు, మూడు పేర్లతో కూడిన జాబితా తీసుకుని ప్రజాదరణ ఉన్నవారిని ఎంపిక చేసేలా కసరత్తు చేస్తు న్నాయి. బలాలు, బలహీనతలు, సామాజికవర్గాల మద్దతు, ఖర్చు భరించేస్థాయి, పరపతి గలవా రు?.. ఇలా అన్ని కోణాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అన్నీ ఆరా తీస్తున్నాయి. వీటన్నింటినీ క్రోడీకరించి వడపోత తర్వాతే అభ్యర్థిని ఎంపిక చేయాలని అన్ని పార్టీల నేతలు లక్ష్యంగా నిర్దేశించారు. స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అంశంపై హైకోర్టు తీర్పు అనంతరం అభ్యర్థుల ప్రకటన చేయాలని, అప్పటివరకు ఎవరికీ భరోసా ఇవ్వొద్దనే భావనలో ఉన్నారు.

## సామాజిక సేవలో యువత


- ప్రమాదాల నివారణకు తమ వంతుగా చర్యలు
- అగ్రహారం నుండి వాండ్రంగి వెళ్ళే నూతన బ్రిడ్జి వద్ద తరచుగా సంభవిస్తున్న ప్రమాదాలు
- సొంత నిధులతో జేసీబీ సహాయంతో అడ్డుగా ఉన్న చెట్లు , తుప్పలు తొలగింపు
- అధికార యంత్రాంగం స్పందించి మరిన్ని చర్యలు చేపట్టాలని వినతి





**జి సిగడాం, ప్రజా జ్యోతి న్యూస్:** జి సిగడాం మండలం అగ్రహారం నుండి వాండ్రంగి పెద్ద బ్రిడ్జి కు వెళ్ళిన మార్గంలో తరచుగా ఎప్పటికప్పుడు ప్రమాదాలు సంభవిస్తూ ఉన్నాయి. దీంతో ఆయా పరిసర గ్రామస్తులు ఆబోతుల పేట , అగ్రహారం కు చెందిన యువకులు తమ వంతు భాధ్యతగా చర్యలు చేపట్టారు. తమ సొంత నిధులతో ఈ రాజు అనే వ్యక్తి జేసీబీ తో అడ్డుగా ఉన్న చెట్లను , రోడ్లను బాగుచేయించారు. ప్రమాదాల బారిన పడి ఎంతో మంది తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి పై లైట్లు లేకపోవడంతో ప్రయాణికులు చీకటి పడితే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే , అధికారులు ఈ విషయం పై దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురామ్ , పొగిరి నారాయణ రావు , గ్రామ యువకులు రమణ బాబు , ఉపేంద్ర, చిత్రి సాయి , లుకలాపు రాము , ఆబోతుల సోమి నాయుడు పాల్గొన్నారు.


## అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష జరుగుతన్న పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన... జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు.





**(ప్రజాజ్యోతి న్యూస్) కర్నూలు అక్టోబర్ 05** పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట భద్రత. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి అక్టోబరు 5 న రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు రాత పరీక్షలు నిర్వహిస్తున్నది. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ కు జారీ చేసింది. పరీక్షలు రాసే అభ్యర్దులకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు జిల్లాలలో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఈ సంధర్బంగా ఆదివారం కర్నూలు జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు పరిశీలించారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ...రాత పరీక్ష ప్రశాంత వాతవారణంలో కొనసాగుతుందన్నారు. కర్నూలు పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఈ పరీక్షకు 261 మంది హాజరయ్యారన్నారు. రెండు విడతల్లో పేపర్-1 ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తున్నారన్నారు.ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారి వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా,కర్నూలు తాలుకా సిఐ తేజమూర్తి ఉన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన వైసీపీ నాయకుడు యనమల కృష్ణుడు



**అన్నవరం అక్టోబర్ 4 ప్రజా జ్యోతి రిపోర్టర్ బి ఎస్ వి ప్రసాద్** కోటనందూరు మండలంలోని వివిధ గ్రామాల్లో వైయస్అర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యనమల కృష్ణుడు గారు పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు .కెఓ. అగ్రహారం గ్రామంలో యువ నాయకులు అల్లంపల్లి కిషోర్ మేనకోడలు రజస్వల వేడుకకు హాజరై చిన్నారి మహిని ఆశీర్వదించారు. అనంతరం ఏఆర్ పేట గ్రామంలో వార్డు మెంబర్ పోతల అర్జునరావు కుమార్తె రజస్వల వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమాలలో వైసీపీ స్టేట్ పబ్లిసిటీ వింగ్ అధికార ప్రతినిధి లాలం బాబ్జి గారు, మండల ఎంపీపీ లగుడు శ్రీనివాస్ గారు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గొర్లి రామచంద్రరావు గారు, వైసీపీ సీనియర్ నాయకులు గంట చక్రారావు, పేకెటి హరికృష్ణ, దిబ్బ శ్రీను, సర్పంచులు పెంటపాటి సతీష్, వేగి అప్పలనాయుడు, గర్సింగి దొరబాబు, బొత్స సత్యనారాయణ, రూత్తల జోగిరాజు, జిల్లా వైసీపీ సెక్రటరీ సుర్ల రాజు, లెక్కల భాస్కర్, దొడ్డి బాబ్జి, సామిరెడ్డి వీరబాబు, ఉప సర్పంచ్ దార్ల సూర్యచంద్ర, ఎస్ఆర్ పేట మహేష్, సోషల్ మీడియా సభ్యులు ఉల్లూరి శ్రీను, నేమల దండు, అలాగే మండల ప్రధాన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణకు జలకళ.. అన్నదాతకు భరోసా

**ఇల్లంతకుంట(మానకొండూర్):** మెట్టప్రాంతం ఇల్లంతకుంట మండలంలో మిడ్‌మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టుల నిర్మాణంతో అనంతారం ప్రాజెక్టు పరిధిలోని భూములకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. మిడ్‌మానేరు, అన్నపూర్ణ, ప్రాజెక్టులు లేని సమయంలో ఇల్లంతకుంట మండలంలో వివిధ గ్రామాల్లో సాగు, తాగునీటి కొరత ఉండేది. భూగర్భ జలాలు అట్టడుగుస్థాయిలో ఉండేవి. ఖరీఫ్, రబీలో వేసిన పంటలు చేతికొస్తాయో.. లేదోనని రైతుల్లో బెంగ ఉండేది. ఈ రెండు ప్రాజెక్టులు లేకముందు మండలంలో బీడు భూములుగా ఉండేవి. ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన తర్వాత నీటిలభ్యత స్థాయి పెరిగింది. అన్నపూర్ణ జలాశయం నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.37 టీఎంసీల నీటి లభ్యత ఉంది. అనంతారం ప్రాజెక్టు నెల రోజులుగా మత్తడి పారుతుంది. ఈ ప్రాజెక్టు కింద 800 ఎకరాల ఆయకట్టు ఉంది. అన్నపూర్ణ జలాశయం కింద ఇల్లంతకుంట మండలంలో 15వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మిడ్‌మానేరు, అన్నపూర్ణ జలాశయం అనంతారం ప్రాజెక్టులు నిండుకుండలా ఉండడంతో దిగువన ఉన్న వ్యవసాయ బోరు బావులలో నీటి నిలువలు సమృద్ధిగా ఉన్నాయి. రబీ సీజన్‌లో ఫిబ్రవరిలో అన్నపూర్ణ జలాశయం ఓవర్‌ఫ్లో గేట్స్ ఎత్తి అనంతారం ప్రాజెక్టు మత్తడి పడేలా చేసినట్టుంటే మండలంలోని బిక్కవాగు పరివాహక ప్రాంత భూముల్లో రెండు పంటలకు ఢోకా లేదని రైతులు అంటున్నారు. బిక్కవాగుపై నిర్మించిన అనంతారం ప్రాజెక్టు మత్తడి పడితే బిక్కవాగు పరివాహక ప్రాంతం

# బిజినెస్

## ఈ దీపావళికి బంగారం కొనడం మరింత కష్టం!



దీపావళి సమీపిస్తున్న కొద్దీ, బంగారం, వెండి ధరలు చారిత్రాత్మక గరిష్టాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, పండుగ డిమాండ్, సెంట్రల్ బ్యాంక్ విధానాల వల్ల పసిడి ధరలు మరింత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ధరలు ఇప్పటికే 10 గ్రాములకు రూ .1,18,000 దాటగా, వెండి కిలోకు రూ .1,44,000 దాటింది. దీపావళి రోజు అంటే అక్టోబర్ 21 నాటికి బంగారం రూ .1.22 లక్షలు, వెండి రూ .1.50 లక్షలకు చేరుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఆజ్యం పోస్తున్న ప్రపంచ పోకడలు**

అంతర్జాతీయంగా, బంగారం ఔన్స్ కు 3950%-% 4000 డాలర్లకు చేరుకుంటుందని, అలాగే వెండి ఔన్స్ కు 49%-% 50 డాలర్లకు పెరుగుతుందని అంచనా. ఈ ధరల వేగానికి విశ్లేషకులు చెబుతున్న కారణాలు.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ డోవిష్ (తక్కువ వడ్డీ రేట్లు, వృద్ధికి ప్రాధాన్యం) వైఖరి, బలహీనపడుతున్న అమెరికన్ డాలర్, బలమైన ఈటీఎఫ్ ఇన్‌ఫ్లోలు, భారతదేశ పండుగ, వివాహ సీజన్ల నుండి బలమైన డిమాండ్.

**వెండికి పారిశ్రామిక డిమాండ్**

సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ టెక్నాలజీస్ వంటి రంగాల నుండి పెరుగుతున్న పారిశ్రామిక డిమాండ్ కూడా వెండి ర్యాలీకి మద్దతు ఇస్తోంది. సరఫరా పరిమితులు, రూపాయి విలువ తరుగుదల మరింత ఊపందుకుంటోంది.

## విండోస్ 10 వాడుతున్నారా?
## అయితే కొన్ని రోజులే గడువు

విండోస్ 10 వాడుతున్న వారికి త్వరలోనే మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ సపోర్ట్ ఆగిపోనుంది. 2025, అక్టోబర్ 14వ తేదీ నుంచి ఎలాంటి సెక్యూరిటీ అప్‌డేట్స్ విడుదల చేయమని స్పష్టం చేసింది. విండోస్ 10కు సపోర్ట్ ఆపేస్తామని దాదాపు రెండేళ్ల క్రితమే మైక్రోసాఫ్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ గడువు కొన్ని రోజుల్లోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం విండోస్ 10 వాడుతున్న వారు ఏం చేయాలో మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యూసఫ్ మెహ్దీ తెలిపారు. తన బ్లాగ్ పోస్టులో ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. విండోస్ 10కు మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేసినా ఎప్పటి మాదిరిగానే ఓఎస్ పని చేస్తుందని కంపెనీ తెలిపింది. అయితే, సెక్యూరిటీ అప్డేట్ మాత్రం రావని తెలిపింది. దీంతో భద్రతాపరమైన రిస్కులు, మాల్ వేర్, కంపాటబిలిటీ వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా ఆన్ లైన్‌లో బ్రౌజింగ్ చేసే వారికి హై రిస్క్ ఉంటుంది. సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ అప్డేట్స్ మాత్రం 2028 అక్టోబర్ వరకు కొనసాగుతాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. ఇది ప్రాథమిక స్థాయిలో భద్రతను మాత్రమే అందిస్తామని కంపెనీ తెలిపింది. అలాగే ఆపరేటింగ్ సిస్టమ్ సెక్యూరిటీ అప్డేట్స్ తో పోలిస్తే యాంటీ వైరస్‌లు ఇచ్చే భద్రత అంతంత మాత్రంగానే ఉంటుందని పేర్కొంది. ఒక వేళ పూర్తి స్థాయిలో భద్రత కావాలనుకునే వారు ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్డేట్స్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకోవచ్చని మైక్రోసాఫ్ట్ తెలిపింది. దీనికి కొంత చెల్లించాల్సి ఉంటుంది. 2025, అక్టోబర్ 15వ తేదీ నుంచి డివైజ్ సెట్టింగ్స్‌లో సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ అందుబాటులోకి ఉంటుందని పేర్కొంది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10ని లక్షలాది మంది వాడుతున్నారు. వారంతా విండోస్ 11కు అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలని మైక్రోసాఫ్ట్ భావిస్తోంది. అందుకే విండోస్ 11కు అప్‌గ్రేడ్ అవ్వకపోతే సెక్యూరిటీ అప్‌డేట్స్ ఆగిపోతాయి. ఏదైనా కారణంతో విండోస్ 10 కొనసాగించాల్సి వస్తే డబ్బులుపెట్టి ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్డేట్ ప్రోగ్రామ్ కింద ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో కేవలం సెక్యూరిటీ అప్డేట్స్ మాత్రమే వస్తాయి. కొత్త ఫీచర్లు, డిజైన్ మార్పిడి రిక్వెస్టులు, నాన్ సెక్యూరిటీ రిక్వెస్టులు ఉండవు. విండోస్ 10 వినియోగిస్తున్న వారు 11కు మారిపోవడం మంచిదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్..
# త్వరలో అందుబాటులోకి డయలర్ హబ్ ఫీచర్..!

ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్ వాట్సాప్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మెటా కంపెనీ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వాట్సాప్‌కు 3.5 బిలియన్లకుపైగా యూజర్లు ఉన్నారు. మేసేజింగ్, ఫొటోలు, వీడియోలు, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్, మనీ ట్రాన్స్‌ఫర్ ఫీచర్స్ ఉన్నాయి. అదే సమయంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్స్‌ను తీసుకువస్తూ యూజర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. తాజాగా మరో ఫీచర్‌ను తీసుకురాబోతున్నది. ఈ డయలర్ హబ్ ఫీచర్ సాయంతో కాంటాక్ట్ నంబర్ సేవ్ చేసుకునే వీలు కల్పిస్తున్నది. అలాగే ప్రత్యేకంగా చాట్ విండోను సైతం ఓపెన్ చేయాల్సి అవసరం ఉండదు. చాలామంది తమ పనులపై ఎవరికైనా వాట్సాప్ కాల్ చేయాలనుకున్నప్పుడు ప్రస్తుతం నంబర్ సేవ్ చేసుకొని మాట్లాడుతుంటారు. కొత్త వ్యక్తులకు ఎక్కువ ఫోన్లు చేయాల్సిన వచ్చిన సమయంలో ప్రతిసారీ కాంటాక్ట్ నంబర్‌ను సేవ్ చేయాల్సిన ఇబ్బంది ఉంది. అదే సమయంలో మొబైల్ కాంటాక్ట్ లిస్ట్ భారీగా పెరుగుతుంది. వాట్సాప్ తీసుకువస్తున్న కొత్త అప్‌డేట్‌తో మీరు ఇకపై ఎవరికైనా కాల్ చేయడానికి




చాట్‌ను ఓపెన్ చేయాల్సిన అవసరం గానీ.. నంబర్‌ను సేవ్ చేయాల్సిన పని ఉండదు. ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్ల కోసం కొత్త కాల్ హబ్ అన్ని కాలింగ్ ఫీచర్స్‌ను ఒకే చోటుకు తీసుకువస్తున్నది వాట్సాప్. యూజర్లు ఇకపై వేర్వేరు స్క్రీన్‌లకు నావిగేట్ చేయకుండా కాల్స్‌ను చేయొచ్చు. కాల్ షెడ్యూల్ పెట్టొచ్చు. డయలర్‌ను ఉపయోగించవచ్చు. కొత్త కాల్స్ ట్యాబ్ ఇప్పుడు ఏకీకృత ఇంటర్‌ఫేస్‌ను కలిగి ఉంది. ఇక్కడి నుంచే యూజర్లు నేరుగా కాల్ చేసుకోవచ్చు. కాల్స్‌ను కాల్‌లను షెడ్యూల్ చేయడంతో పాటు డయలర్ నుంచి నంబర్‌కి డయల్ చేయొచ్చు. ఈ మార్పు కాలింగ్‌ను వేగంగా, సులభతరంగా ఉండనున్నది. యూజర్లు మొదట కాల్స్ బటన్‌పై క్లిక్ చేయాల్సి. ఆ తర్వాత కుడివైపున పైన ప్లస్ గుర్తు కనిపిస్తుంది. ఇందులో న్యూ కాల్ లింక్, కాల్ ఏ నంబర్, న్యూ కాంటాక్ట్, షెడ్యూల్ కాల్స్ ఆప్షన్ కనిపిస్తాయి. ఇందులో ఇందులో కాల్ ఏ నంబర్‌పై క్లిక్ చేస్తే డయలర్ ఓపెన్ అవుతుంది. ఏ నంబర్‌కు అయితే ఫోన్ చేయాలనుకున్నారో ఆ నంబర్ నెంబర్‌ను ఎంటర్ చేసి కాల్ చేయవచ్చు. కాల్‌ను సైతం షెడ్యూల్ చేసుకునే వీలుంటుంది. కొత్త షెడ్యూలింగ్ ఫీచర్ ముందుగానే కాల్‌లను ప్లాన్ చేసుకోవడానికి, చాట్ ద్వారా వివరాలను పంచుకోవడానికి అనుమతి ఉంటుంది. ఇక బిజినెస్ అకౌంట్స్ ఇప్పుడు వెరిఫికేషన్ బ్యాడ్జ్ అందుకుంటాయి. ఖాతా నిజమైనదా? కదా? అని యూజర్లు సులభంగా గుర్తించేందుకు వీలుంటుంది. ఈ ఫీచర్ మోసాల బారినపడకుండా కాపాడుతుంది. కొత్త కాల్ హబ్ ఫీచర్ కాలింగ్‌ను సులభతరం చేస్తుంది.

# చిన్న బిజినెస్.. పెద్ద మ్యాజిక్!

నేటి రోజుల్లో చిన్న చిన్న వ్యాపార యజమానులందరూ సులభంగా, వేగంగా, సురక్షితంగా పని చేయాలనుకుంటే, ఒక్కసారి ఈ స్మార్ట్ టూల్స్ ప్రయత్నించాల్సిందే!

**పేపర్ ప్లస్ డిజిటల్ మ్యాజిక్**

ఒకప్పుడు నోట్స్ రాస్తే కేవలం కాగితాలకే పరిమితం అయ్యేది. ఒక్క కాగితం మిస్ అయినా, రాసిన మాట, గీసిన డ్రాయింగ్ అంతా మాయం అవుతుంది. ఇప్పుడు 'హుయిన్ డిజిటల్ నోట్‌బుక్'తో ఆ భయం పూర్తిగా తొలగింది. ఇది కేవలం ఒక నోట్‌బుక్ కాదు, పేపర్ ప్లస్ డిజిటల్ టాబ్లెట్. ఇందులో రాసిన ప్రతి అక్షరం, గీసిన ప్రతి లైన్ వెంటనే మీ డివైస్‌లో స్టోర్ అవుతుంది. ఆడియో రికార్డ్ ఫీచర్‌తో, మీ వాయిస్ కూడా నోట్స్‌తో కలిసి రికార్డ్ అవుతుంది. ఒక్క క్లిక్‌తో షేర్ చేసుకోవచ్చు కూడా. పేజీలను మిళితం చేయడం, విడగొట్టడం చాలా సులభం. ముఖ్యమైన విషయాలను హైలైట్ చేయడానికి సులభమైన టూల్స్ కూడా ఉన్నాయి. ధర రూ. 7,105 ల ప్యాక్‌లో ఒక హుయిన్ నోట్, ఏ ఐ నోట్ ప్యాడ్, యూఎస్బీ కేబుల్, మాగ్నెటిక్ పెన్ స్లీవ్, రీఫిల్స్, ప్లాస్టిక్ పెన్ నిబ్స్, మార్గదర్శక పుస్తకంతో వస్తుంది.

**ఒక్క కార్డు చాలు!**

ఒకప్పుడు పాత పేపర్ విజిటింగ్ కార్డ్ అంటే స్టేటస్ సింబల్. 'ఇదిగో నా కార్డ్' అంటూ ఇచ్చేసి స్టయిల్ కొట్టేవాళ్లు. కాని, నిజం చెప్పాలంటే ఆ కార్డుల ఫ్యూచర్ బాగుండేది కాదు. రోజుల తరబడి జేబులో మురిగి, కాఫీ కప్పుల కింద నలిగి, చివరికి ఏ డస్ట్‌బిన్‌లోనో ఎండ్ అయ్యేది. అలాంటప్పుడు



వాటికోసం అనవసరంగా ఖర్చు ఎందుకు చేయటం. కేవలం, ఒక్క టాప్‌తోనే మీ పేరు, నంబర్, వెబ్‌సైట్, సోషల్ మీడియా అన్నీ ఎదుటివారి మొబైల్‌లో బజ్ అయ్యే మాయ చేస్తుంది ఈ 'టాప్‌మో స్మార్ట్ బిజినెస్ కార్డ్'. ఇందులో చిన్న లోగో, క్యూ ఆర్ కోడ్, లైఫ్‌టైమ్ వాలిడిటీ అన్నీ రెడీ! యాప్ డౌన్‌లోడ్ అనే తలనొప్పి లేదు, 'కార్డులు అయిపోయాయి' అనే టెన్షన్ లేదు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చు కూడా. ధర కేవలం రూ. 599 మాత్రమే! స్మాల్ బిజినెస్ ఓనర్స్‌కు కస్టమర్ డేటా, ఫైనాన్స్ రికార్డులు, ప్రాజెక్ట్ ఫైల్స్ అన్నీ రక్షించుకోవాలంటే పెద్ద సర్వర్ అవసరమా? లేనే లేదు! బిజినెస్ డీటైల్స్ అన్నీ ఒకే చోట, సురక్షితంగా ఉంచాలంటే 'అప్రికార్న్ ఏజిస్ ప్యాడ్‌లాక్' బెస్ట్ ఆప్షన్. 480 జీబీ స్టోరేజ్, 256%-%బిట్ ఎన్‌క్రిప్షన్, రగ్‌డ్ బాడీ, టూ స్టెప్ వెరిఫికేషన్‌తో ఏ ఫైల్ అయినా సేఫ్‌గా స్టోర్ చేస్తుంది. ఇది కేవలం స్టోరేజ్ సర్వర్ మాత్రమే కాదు, చిన్న బిజినెస్‌కి నమ్మకమైన డేటా గార్డు. ఆఫీస్‌లోనైనా, ఇంట్లోనైనా, ట్రావెల్‌లోనైనా సులభంగా ఉపయోగించవచ్చు. చిన్న, పోర్టబుల్ బాడీతో జేబులోనైనా పెట్టుకుని క్యారీ చేయవచ్చు. ఏకకాలంలో డేటా యాక్సెస్, బ్యాకప్, షేర్ అన్నీ సులభం. ధర రూ. 49,325.

# భారత్ నా మాతృభూమి, దేవాలయం లాంటిది
# పాకిస్తాన్ మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు

భారత మూలాలున్న పాకిస్తాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇటీవలికాలంలో తరుచూ పాకిస్తాన్ క్రికెట్ బోర్డును ఎండగడుతూ, భారత్‌పై ప్రేమను వ్యక్తపరుస్తున్న డానిష్.. తాజాగా మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశాడు. భారత్‌పై అతి ప్రేమను ఒలకబోస్తున్నాడని ?కొందరు పాకిస్తానీలు కామెంట్లు చేస్తున్న నేపథ్యంలో డానిష్ ఇలా స్పందించాడు. ఇటీవలికాలంలో కొందరు పాకిస్తానీలు నన్ను ప్రశ్నిస్తున్నారు. భారత మూలాలున్నా, క్రికెటర్‌గా ఎదిగేందుకు పాకిస్తాన్ ఇన్ని అవకాశాలు ఇస్తే.. భారత్‌కు సానుకూలంగా ఎందుకు మాట్లాడతావని నిలదీస్తున్నారు. భారత పౌరసత్వం కోసం ప్రయత్నిస్తున్నాని కామెంట్లు చేస్తున్నారు. నాపై సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న ఈ మాటల దాడిపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ముందుగా పాకిస్తాన్ ప్రజలకు నేను కృతజ్ఞుడిని. వారి నుంచి నాకు ఎంతో ప్రేమ లభించింది. అయితే కొందరు మాత్రం నా పట్ల చాలా వ్యతిరేక భావంతో వ్యవహరించారు. ముఖ్యంగా



పాకిస్తాన్ క్రికెట్ బోర్డు. పీసీబీలోని కొందరు అధికారుల నుంచి నేను తీవ్ర వివక్షను ఎదుర్కొన్నాను. ఓ దశలో బలవంతంగా మతం మార్పించేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయి. కొందరు నేను భారత పౌరసత్వం ఆశిస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రస్తుతానికి నాకు అలాంటి ఉద్దేశం లేదు. భవిష్యత్తులో అలాంటి అవసరం ఉన్నా, %జూూూ% లాంటి చట్టాలు అందుబాటులో ఉన్నాయి. పౌరసత్వం కోసం నేను భారత్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నానడం చాలా తప్పు. భారత్ నా పూర్వీకుల భూమి. అది నాకు దేవాలయం లాంటిది. పాకిస్తాన్ నా జన్మభూమే. కానీ భారత్ నా మాతృభూమి అంటూ తన '%శ%' ఖాతాలో రాసుకొచ్చాడు. కాగా, డానిష్ కనేరియా పాకిస్తాన్‌లో పుట్టి పెరిగనప్పటికీ.. అతని పూర్వీకుల మూలాలు భారత్‌లోని గుజరాత్ ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తుంది. 1980 డిసెంబర్ 16న పాకిస్తాన్‌లోని లాహోర్‌లో జన్మించిన డానిష్.. 61 టెస్టుల్లో 261 వికెట్లు, 18 వన్డేల్లో 15 వికెట్లు తీసి పాక్ తరఫున గొప్ప స్పిన్నర్‌గా పేరు తెచ్చుకున్నాడు. అయితే స్పాట్ ఫిక్సింగ్ వివాదంలో ఇరుక్కోవడంతో అతని కెరీర్ అర్ధంతరంగా ముగిసింది. దీని కారణంగా అతను జీవితకాల నిషేధం ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం అతను కుటుంబంతో పాటు అమెరికాలో ఉంటున్నాడు.

# మహిళల వరల్డ్ కప్... పాక్‌తో మ్యాచ్‌లో భారత్ ఫస్ట్ బ్యాటింగ్

ఇంటర్నెట్ డెస్క్: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో మరో ఆసక్తికరమైన పోరుకు వేళైంది. కొలంబో వేదికగా భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ మరికాసేపట్లో జరగనుంది. పురుషుల ఆసియా కప్‌లో ఇరు జట్ల మధ్య వివాదాలు చోటు చేసుకోవడం తెలిసిందే. ఇప్పుడు మహిళా జట్ల మధ్య పోటీపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో టాస్ నెగ్గిన పాకిస్థాన్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత టీమ్‌ఇండియా బ్యాటింగ్ చేయనుంది. శ్రీలంకపై హాఫ్ సెంచరీ చేసిన అమన్ జ్యోత్‌కు బదులు రేణుకా సింగ్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చింది.

**తుది జట్లు:**

భారత్: ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), జేమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి

పాకిస్థాన్: మునీబా అలీ, సదాఫ్ షర్మాస్, సిద్రా అమిన్, అలియా రియాజ్, సిద్రా నవాజ్ (వికెట్ కీపర్), ఫాతిమా సనా (కెప్టెన్), నటాలియా పర్వేజ్, డయానా బేగ్, నష్రా సంధు, సాదియా ఇక్బాల్



**అలాంటి ప్రశ్నలకు అవకాశం లేదు**

భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్‌కు ముందు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు జరిగాయి. టీమ్‌ఇండియా తరఫున బౌలింగ్ కోచ్ అవిష్కర్ సాల్వి హాజరయ్యాడు. అతడి ముందు పాక్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ 'ఆసియా కప్' వివాదాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, మీడియా మేనేజర్ వెంటనే కలగజేసుకొని 'ఆ ప్రశ్నకు ఇక్కడ సమాధానం ఇవ్వడం జరగదు' అని స్పష్టం చేశారు. భారత్ - పాక్ మధ్య ఇప్పటి వరకు అంతర్జాతీయంగా 27 మ్యాచుల్లో తలపడ్డాయి. అయితే, 24-3 తేడాతో భారత్‌దే ఆధిపత్యం. ఇక వన్డేల్లో ఒక్కసారి కూడా భారత్‌పై పాక్ గెలవలేదు. ఆ మూడు మ్యాచులు కూడా టీ20ల్లోనే విజయం సాధించింది.

# స్పోర్ట్స్

## వన్డే కెప్టెన్‌గా ఎంపిక..
## శుబ్‌మన్ గిల్ 'బోల్డ్' రియాక్షన్



టీమిండియా వన్డే కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల శుబ్‌మన్ గిల్ హర్షం వ్యక్తం చేశాడు. వన్డేల్లోనూ జట్టుకు సారథ్యం వహించడం తనకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నాడు. వరల్డ్‌కప్ గెలవడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఈ సందర్భంగా గిల్ పేర్కొన్నాడు.

కాగా ఆస్ట్రేలియా పర్యటన నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి వన్డే, టీ20 జట్లను శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, అనూహ్య రీతిలో రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తొలగించిన బోర్డు.. అతడి స్థానంలో గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. వన్డే వరల్డ్‌కప్-2027 టోర్నీని దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు.

**ప్రపంచకప్ గెలవడమే లక్ష్యం**

ఈ నేపథ్యంలో తాను వన్డే కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల టెస్టు సారథి శుబ్‌మన్ గిల్ స్పందించాడు. "వన్డే క్రికెట్‌లో జాతీయ జట్టును ముందుకు నడిపించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. చాంపియన్ జట్టుకు సారథిగా ఎంపిక కావడం గర్వంగా ఉంది. నేను కూడా జట్టును గొప్పగా ముందుకు నడిపించాలనే ఆశిస్తున్నా. వరల్డ్‌కప్ కంటే ముందు మేము 20 వరకు వన్డేలు ఆడబోతున్నాము. ప్రపంచకప్ గెలవడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. ప్రతి ఒక్క ఆటగాడు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే కోరుకుంటాడు. నేను కూడా అంతే. సౌతాఫ్రికాలో జరిగే ఐసీసీ టోర్నీకి మేము పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతాము. వరల్డ్‌కప్ గెలుస్తాం" అని శుబ్‌మన్ గిల్ పేర్కొన్నాడు.

**రోహిత్ ఖాతాలో రెండు**

కాగా చివరగా 2011లో మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో వన్డే వరల్డ్‌కప్ గెలిచిన టీమిండియా.. 2023లో సొంతగడ్డపై రోహిత్ శర్మ కెప్టెన్సీలో రన్నరప్‌గా నిలిచింది. అయితే, ఈ ఏడాది ఐసీసీ వన్డే చాంపియన్స్ ట్రోఫీ-2025లో మాత్రం విజేతగా నిలిచింది. తద్వారా కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఖాతాలో రెండు ఐసీసీ టైటిళ్లు చేరాయి. అంతకుముందు టీ20 ప్రపంచకప్-2024 టోర్నీలోనూ కెప్టెన్ హోదాలో రోహిత్ భారత్‌ను చాంపియన్‌గా నిలిపిన సంగతి తెలిసిందే.

**అనూహ్య రీతిలో**


ఆ తర్వాత అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. ఇటీవలే టెస్టులకు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. వన్డేల్లో కొనసాగుతానని స్పష్టం చేసిన రోహిత్ శర్మ పది కిలోల బరువు తగ్గి ఫిట్‌నెస్‌ను మరింత మెరుగుపరచుకున్నాడు. వన్డే వరల్డ్‌కప్-2027 ఆడటమే లక్ష్యంగా తనను తాను తీర్చిదిద్దుకుంటున్న తరుణంలో అనూహ్య రీతిలో కెప్టెన్సీ కోల్పోయాడు. కాగా 2027లో సౌతాఫ్రికా- జింబాబ్వే- నమీబియా ఉమ్మడిగా వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి.




# నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్' టీజర్ వచ్చేది అప్పుడే.!

యువ హీరో నాగశౌర్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన నటించిన పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చడంతో ఎలాగైన హిట్ కొట్టాలానే కసితో ఉన్నాడు. ఈ క్రమంలోనే వరుస సినిమాలను ఓకే చేస్తున్నాడు. ఈ క్రమంలోనే కొత్త దర్శకుడు రామ్ దేశిన డైరెక్షన్‌లో నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్' అనే ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే తాజాగా ఈ మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 11.57 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

# ఓటీటీలోకి 'త్రిబాణధారి బార్బరిక్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!




నటులు సత్యరాజ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్.సింహ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం త్రిబాణధారి బార్బరిక్. ఈ సినిమాకు మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించగా.. సత్యం రాజేశ్, సాంచీ రాయ్, వీటీవీ గణేశ్, క్రాంతి కిరణ్, మేఘన తదితరులు కీలక పాత్రల్లో నటించారు. విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించగా ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ సంగీతం అందించింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశను పరిచింది. మరోవైపు ఈ సినిమా డిజాస్టార్ అవ్వడం వలన మనస్థాపం చెందిన దర్శకుడు భావోద్వేగానికి గురవ్వడంతో పాటు తన కష్టానికి తగిన ఫలితం దక్కలేదని మీడియా ముందే చెప్పుతో కొట్టుకున్నారు. దీంతో ఈ మూవీ గురించి వైరల్ అయింది. అయితే వివాదాస్పదంగా మారిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక సన్ నెక్స్ట్‌లో ఈ చిత్రం అక్టోబర్ 10 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్యామ్ కుమార్ (సత్యరాజ్), పేరుగాంచిన మానసిక వైద్య నిపుణుడు. తన కొడుకు, కోడలు మరణించడంతో, మనవరాలు సుధ (మేఘన)ని అతను ప్రేమగా, జాగ్రత్తగా పెంచుకుంటున్నాడు. ఒక రోజు సుధ స్కూల్‌కు వెళ్లిన తర్వాత అదృశ్యమవుతుంది. దీంతో ఆందోళన చెందిన శ్యామ్ వెంటనే పోలీసులను సంప్రదిస్తాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తారు. అయితే, ఆ తర్వాత ఏం జరిగింది? సుధ అదృశ్యానికి గల కారణం ఏమిటి? ఈ ఊరిలోని రహస్యమైన వ్యక్తి రామ్ (వశిష్ఠ ఎన్. సింహా) లేదా కుఖ్యాత లేడీ డాన్ వాకిలి పద్మ (ఉదయభాను)కు ఈ ఘటనతో ఏదైనా సంబంధం ఉందా? వీరిద్దరూ డబ్బు కోసం చేస్తున్న రహస్య, అక్రమ వ్యవహారాలు ఏమిటి? సుధ మిస్సింగ్ కేసులో దాగిన నిజాలు ఏమిటి? శ్యామ్ తన మానసిక నైపుణ్యాన్ని ఉపయోగించి ఈ కేసును ఛేదించగలిగాడా? లేక ఆ రహస్యం అలాగే మిగిలిపోయిందా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



# తమిళ నటుడు సూరి, సుహాస్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం.. సముద్రంలో పడవ బోల్తా..

ప్రముఖ తమిళ నటుడు సూరి మరియు తెలుగు నటుడు సుహాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'మండాడి' సినిమా షూటింగ్‌లో పెద్ద ప్రమాదం జరిగింది. తమిళనాడులోని రామనాథపురం జిల్లా, తొండి సముద్రతీర ప్రాంతంలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్న సమయంలో సాంకేతిక నిపుణులు ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పడవలో ఉన్న ఇద్దరు వ్యక్తులు నీట మునిగిపోయారు. అలాగే, సుమారు కోటి రూపాయల విలువైన కెమెరాలు, ఇతర సాంకేతిక సామాగ్రి పూర్తిగా ధ్వంసమై, నీటిలో మునిగిపోయాయి. దీంతో యూనిట్ సభ్యులు వెంటనే అప్రమత్తమై నీట మునిగిన ఇద్దరిని కాపాడటంతో ప్రాణనష్టం తప్పింది. నటులు సూరి, సుహాస్ ఈ సమయంలో పడవలో లేకపోవడం వల్ల సురక్షితంగా ఉన్నారు. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ నిర్మాతగా, మాతిమారన్ పుగళేంధి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా ద్విభాషా చిత్రంగా (తమిళం, తెలుగు) తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సూరి హీరోగా నటిస్తుండగా.. సుహాస్ విలన్‌గా నటిస్తున్నాడు.



# డ్యూడ్ 'సింగారి చిన్నదాని' గురించి విన్నావా?




తమిళ డబ్బింగ్ చిత్రాల ద్వారా ప్రదీప్ రంగనాథన్ టాలీవుడ్‌కు దగ్గరయ్యాడు. ఈ క్రమంలోనే లవ్‌టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ చిత్రాలతో మెప్పించాడు. అయితే, ఆయన తాజాగా డ్యూడ్ అనే కొత్త సినిమాతో వస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ నుంచి మరో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ మూవీని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. దర్శకుడు కీర్తీశ్వరన్ తెరకెక్కిస్తున్నారు. ప్రేమలు సినిమాతో గుర్తింపు పొందిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుంది. సంగీతం సాయి అభ్యంకర్ అందిస్తున్నారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17న ఈ చిత్రం విడుదల కానుంది.



# జాక్వెలిన్ ఫెర్నాండేజ్ అందం చూడతరమా..? ఫ్యాషన్ వీక్‌లో మెరుపులు

గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ ఇండియావైడ్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న భామల్లో ఒకరు జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ఎప్పటికప్పుడు కొత్త కొత్త లుక్స్‌లో కనిపిస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తుంటుంది. లండన్ ఫ్యాషన్ వీక్ అనామిక ఖన్నా షోలో హొయలు పోతూ కెమెరాకు ఫోజులిచ్చిన జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తాజాగా మరో ఈవెంట్‌లో తళుక్కున మెరిసింది. ఈసారి పారిస్ ప్యాషన్ వీక్ 2025లో బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో సందడి చేసింది. జాక్వెలిన్ ఫెర్నాండేజ్ వేలాడుతున్న హియర్ రింగ్స్‌తో చేతిలో హ్యాండ్ పర్స్ పట్టుకొని లైటింగ్స్ మధ్య హొయలు పోతూ కెమెరాలకు ఫోజులిచ్చింది. బ్లాక్ డ్రెస్‌లో నక్షత్రంలా మెరిసిపోతూ కుర్రకారు మతులు పోగొడుతోంది. కిక్, రేస్, రైడ్, వెల్‌కమ్, హౌస్‌ఫుల్ సినిమాలతో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న జాక్వెలిన్ త్వరలో తెలుగులో ఓ సినిమా చేసేందుకు రెడీ అవుతుందంటూ సోషల్ మీడియాలో ఓ వార్త హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ భామ టాలీవుడ్ డైరెక్టర్‌తో ఫీ మేల్ సెంట్రిక్ సబ్జెక్టుతో ఓ సినిమా చేసేందుకు రెడీ అయిందని తెలుస్తుండగా.. దీనిపై రానున్న రోజుల్లో ఏమైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com